

# విజయభాను

విజయవాడ, మంగళవారం 08-08-2017 | VIJAYABHANU DAILY VIJAYAWADA EDITION | సంపుటి : 10 సంచిక : 66 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## సోదర భావాన్ని, ఐక్యతను చాటేదే

# రక్షాబంధన్ ఉత్సవ్

### ఆడబిడ్డలకు అండగా ఉంటా



అమరావతి : రక్షా బంధన్ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, దేశ విదేశాల్లో ఉన్న తెలుగు వారందరికీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని తెలుగుదేశం పార్టీ మహిళా నేతలు చంద్రబాబుకు సోమవారం రాఖీలు కట్టారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో మంత్రి పరిటాల సునీత, మాజీ మంత్రి పీతల సుజాత, తెదేపా మహిళా అధ్యక్షురాలు శోభా హైమావతి, కృష్ణా జిల్లాపరిషత్ ఛైర్మన్ గద్దె అనురాధ, కృష్ణా జిల్లా తెదేపా మహిళా అధ్యక్షురాలు ఆచంట సునీత రాఖీలు కట్టి ఆయనకు మిఠాయి తినిపించారు.

అలాగే పర్యాటకాభివృద్ధి సంస్థ ఛైర్మన్ సతీమణి రజనీ, బ్రహ్మకుమారీలు, తెలంగాణ తరువాయి 2లో

### అక్కచెల్లెళ్లు సుఖంగా ఉండాలి




హైదరాబాద్: అన్నా-చెల్లెలి అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ. ఆత్మీయతానుబంధాలను చాటే ఈ విశిష్టమైన పర్వదినాన్ని పురస్కరించుకొని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన చెల్లెలు షర్మిల రాఖీ కట్టారు. తనకు వైఎస్ షర్మిల ఆత్మీయంగా రాఖీ కడుతున్న ఫొటోను వైఎస్ జగన్ తన ట్విట్టర్ పేజీలో పోస్టు చేశారు. అక్కచెల్లెమ్మలందరూ ఎల్లప్పుడూ ఆనందంగా ఉండాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

అంతకుముందు రాఖీపౌర్ణమి పండుగ సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల ప్రేమానుబంధాలను, పరస్పర అనురాగాన్ని చాటే రాఖీపౌర్ణమి తరువాయి 2లో

---

సోమవారం చంద్రగ్రహణం సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయం మూసివేత.... తిరిగి మంగళవారం తెల్లవారిజామున 2 గంటలకు తెరుచుకోనున్న ఆలయం, శుద్ధి పుణ్యాహవచనం , నిత్య పూజ కైంకర్యాలు ఉదయం ఏడు గంటల నుండి దర్శనం.



# వైద్యో నారాయణో హరిః

- వైద్యరంగ అభివృద్ధికి కృషి చేయాలి
- నేనిప్పుడు బిజెపి మనిషిని కాను..
- ఉరాష్ట్రపతి పదవికి వన్నె తెస్తా
- శ్రీవారి సన్నిధిలో ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు



తిరుపతి: దేశంలో వైద్యరంగ అభివృద్ధికి ప్రభుత్వాలు మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందని ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్య నాయుడు అన్నారు. తిరుపతిలోని పద్మావతీ మహిళా వైద్య కళాశాల ప్రాంగణంలో రూ.16.5కోట్ల వ్యయంతో నిర్మించిన వసతిగృహ సముదాయాన్ని, రూ.37కోట్లతో నిర్మించిన ప్రసూతి ఆస్పత్రిభవనాన్ని ఈరోజు ఆయన ప్రారంభించారు. అనంతరం శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ వైద్యశాల తరువాయి 2లో

# పన్నీర్ మళ్లీ సీఎం అవుతారు!



చెన్నై: మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం మళ్లీ తమిళ నాడు సీఎం అవుతారని మాజీ మంత్రి పాండ్యరాజన్ అన్నారు. అన్నాడీఎంకే పురచ్చి తలైవి అమ్మ వర్గం నేత పన్నీర్ సెల్వం నేతృత్వంలో అన్నాడీఎంకేలోని అన్ని వర్గాలు మళ్లీ ఏకమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో డెంగీ జ్వరతీవ్రతను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైదని ఆరోపిస్తూ అన్నాడీఎంకే (పురచ్చి తలైవి అమ్మ) వర్గం నేతృత్వంలో ఆగస్టు 10న నిరసనకు పిలుపునిచ్చారు. తరువాయి 2లో

## నేరస్థులకు శిక్ష పడాల్సిందే



దిల్లీ: హరియాణాలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు సుభాష్ బరాల కుమారుడు వికాస్ ఓ యువతిని వేధించిన ఘటనపై కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ తీవ్రంగా స్పందించారు. రాష్ట్రప్రభుత్వం నేరస్థులను కచ్చితంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా భాజపా ప్రభుత్వంపై విమర్శలు చేశారు. చండీగఢ్‌లో యువతిపై వేధింపులు, అపహరణ యత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. రాష్ట్రంలోని భాజపా ప్రభుత్వం తరువాయి 2లో

## ప్రతీ ఒక్క ఎకరానికీ
# సాగునీటికి కృషి

### సీఎం నారా చంద్రబాబు నాయుడు



రాజమహేంద్రవరం: ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రతీ ఒక్క ఎకరానికీ సాగునీరు అందించడమే జీవిత ఆశయమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సోమవారం సీతానగరం మండల పరుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నిర్మాణపు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం గోదావరి నది నీరు సుమారు 3 నుండి 5 వేలు టిఎంసిలు వరద నీరు వృధాగా సముద్రంలో కలిసిపోతోందని అన్నారు. ఈ నీటిని ఫాస్ట్ ట్రాక్ ప్రాజెక్ట్ ద్వారా ఉభయ గోదావరి జిల్లాలతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాలకు తాగునీరు సాగునీరు అందించేందుకు పుష్కర పురుషోత్తపట్నం, పట్టిసీమ తదితర ప్రాజెక్టులు చేపట్టామన్నారు. 2019 సంవత్సరం నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని, తరువాయి 2లో

# ముగిసిన అమర్‌నాథ్ యాత్ర

శ్రీనగర్: 40 రోజులపాటు వైభవంగా సాగిన అమరనాథ్ యాత్ర సోమవారంతో ముగిసింది. ఈ ఏడాది మొత్తం 2.60లక్షల మంది భక్తులు పరమ శివుడ్ని దర్శించుకున్నారు. జూన్ 29న జమ్ముకశ్మీర్‌లో రెండు మార్గాల ద్వారా ప్రారంభమైన అమర్‌నాథ్ యాత్ర రాఖీ పౌర్ణమితో సమాప్తమైంది. శివుని పవిత్రగాథ, చారీముబారక్‌ను అమర్‌నాథ్‌కు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేయడంతో ఈ యాత్ర ముగిసింది.

ఈ ఏడాది అమర్‌నాథ్ యాత్రలో అపశృతి చోటుచేసుకుంది. జులై 10న అమర్‌నాథ్ యాత్రికులపై ముష్కరులు జరిపిన కాల్పుల్లో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడుల నేపథ్యంలో అమర్‌నాథ్ యాత్రికులకు మరింత భద్రతను పెంచిన విషయం తెలిసిందే.




## టేకిట్ ఈజీ



పాదయాత్రల తాకిడి ఉండేలాఉంది... వాగ్దానాలు కురిపిస్తారు.. నాయకులతో కాస్త జాగ్రత్త !!

# ఉద్వేగానికి లోనైన వెంకయ్య



నెల్లూరు: చిన్నతనంలోనే తల్లిని కోల్పోయిన తనకు భారతీయ జనతా పార్టీ (భాజపా) ఎంతో ఇచ్చిందని ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యనాయుడు అన్నారు. ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన సందర్భంగా నెల్లూరు వీఆర్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాన్య కుటుంబం నుంచి అంచెలంచెలుగా ఎదిగానని చెప్పారు. చిన్నతనంలోనే తల్లిని కోల్పోయిన తనకు పార్టీ అత్యున్నత పదవులిచ్చి ఉన్నతస్థానంలో నిలిపిందని గుర్తు చేసుకున్నారు. అలాంటి పార్టీని వీడడం బాధగా ఉందంటూ ఒకింత ఉద్విగ్నానికి గురయ్యారు. సభావేదికపై కంటతడి పెట్టారు.

**ఆ ఇద్దరే మార్గదర్శకులు**

తన జీవితంలో దుర్గాప్రసాద్, సోమయ్య అనే ఇద్దరు వ్యక్తులు మార్గదర్శకులుగా ఉన్నారని వెంకయ్య అన్నారు. సంఘం తనకు వ్యక్తిత్వాన్ని ఇస్తే.. ఏబీవీపీ తనకు నాయకత్వాన్ని నేర్పిందని, క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావం తరువాయి 2లో

# నంద్యాల చరిత్ర పుస్తకావిష్కరణ

నంద్యాల : వేల సంవత్సరాల చరిత్ర కలిగిన నంద్యాల పట్టణ చారిత్రక ప్రస్థానానికి పుస్తక రూపం ఆవిష్కృతమైంది. నంద్యాల సూరన సారస్వత సంఘం ప్రధాన కార్యదర్శి, సాహితీ వేత్త, కవి, చరిత్రకారుడు గొట్టిముక్కల సుబ్రహ్మణ్య శాస్త్రి కలం నుంచి జాలు వారిందీ పుస్తకం. సూరన సారస్వత సంఘం అధ్యక్షుడు డా.గెలివి సహదేవుడు ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలోని వివేకానంద ఆడిటోరి యంలో సాహితీ వేత్తలు, ప్రముఖుల చేతుల మీదుగా నంద్యాల చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. నంద్యాల పురపాలక తొలి అధ్యక్షుడు కాదరబాద్ నరసింగ రావుకు సమర్పణ చేశారు. అనంతరం పుస్తకం గురించి వినిపించారు. డా.రవీంద్రనాథ్, రచయితలు డా.శ్రీదేవి, డా.కిశోర్‌కుమార్, డా.ఉదయశంకర్, డా.సత్య శివసుందరి పుస్తక ఘనతను, రచయిత ప్రతిభా నైపుణ్యాలు, జ్ఞాపక శక్తి గురించి కొనియాడారు. అన్నెం శ్రీనివాసరెడ్డి సమన్వయకర్తగా వ్యవహ రించారు. పుస్తకంలో రాజకీయ, చారిత్రక విషయాలు, సాహిత్య, వ్యవసాయ, విద్యా, వైద్యా, కళా రంగాల గురించి ప్రస్తావించటాన్ని వక్తలు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ సొసైటీ నిర్వాహకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, కేశవ, శోభన్, ప్రదీప్, బాబూరావ్, నంది రైతు సమాఖ్య అధ్యక్షుడు ఉమామహేశ్వరరావ్ తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టులతోనే సమాజ మార్పు

కందుకూరు: ప్రభుత్వాలు మారినా ఆర్థిక విధానాల్లో మార్పులు రావడం లేదని.. ధనవంతులు ఇంకా సంపన్నులు అవుతుంటే పేదల బతుకులు మరింత ఛిద్రమవు తున్నా యని.. ఇలాంటి పరిస్థితుల్లో సమూల మార్పు అనేది కమ్యూనిస్టు పార్టీలు అధికారంలోకి వస్తేనే సాధ్యమవుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. కందుకూరులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో, దేశంలో నెలకొన్న పరిస్థితుల నుంచి ప్రజలు గట్టెక్కాలంటే కమ్యూనిస్టు పార్టీల అవసరం ఉందన్నారు.

ప్రభుత్వాలు మారినా కార్మికులు, శ్రామికులను పట్టించుకోకుండా కేవలం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నారని విమర్శిం చారు. గత మూడేళ్ల కాలంలో ఉద్యోగాలు కల్పించింది లేదని, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచారని ఎద్దేవా చేశారు. గ్యాస్ ధరల పెంపుపై మహిళలు తీవ్ర అసంత ృప్తితో ఉన్నారన్నారు.

రాష్ట్రంలో దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నా ప్రభుత్వం పట్టించుకోకుండా నంద్యాల ఉప ఎన్నికలకే ప్రాధాన్యమివ్వడం సిగ్గుచేట న్నారు. ఈ నెల 8, 9 తేదీల్లో కరవు ప్రాంతాల్లో సీపీఐ ఆధ్వర్యంలో పర్యటన ఉంటుందన్నారు. వచ్చే ఏడాది మార్చి నెలలో కడప జిల్లాలో రాష్ట్ర మహాసభలుంటాయని, ఇందులో సీపీఎంతో భవిష్యత్తులో కలిసి పనిచేసేలా తీర్మానించి జాతీయ పార్టీ ద ృష్టికి తీసుకెళ్లనున్నట్టు చెప్పారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు రావుల వెంకయ్య, ఎం.ఎల్.నారాయణ, కె.అరుణ, కె.వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రమేష్‌గౌడ సాటిలేని మేటి నటుడు



బళ్లారి : రంగస్థల నటనలో రమేష్‌గౌడ పాటిల్ అయిదు దశాబ్దాలుగా సేవలందించి ఉత్తమ ప్రదర్శనతో సాటిలేని మేటినటుడిగా ఎదిగారని నాడోజ పురస్కార గ్రహీత డా.సుభద్రమ్మ మన్సూర్ పేర్కొన్నారు.

స్థానిక రాఘవ కళామందిరంలో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యాభై ఏళ్ల నుంచి సాంఘిక, జానపద, పౌరాణిక, చారిత్రక నాటకాల్లో నటిస్తూ, నేటికీ ఎంతో ఉత్సాహంతో ఎంత దూర మైనా వచ్చి నాటకాల్లో ప్రదర్శిస్తారని నాటక కళాపిపాసి రమేష్ గౌడ అని కొనియాడారు.

రంగాయణ సంచాలకుడు మహేష్ పాటిల్ మాట్లాడుతూ ఇలాంటి కళాకారులు దొరకడమే అరుదని ప్రశంసించారు. ఉదయం నుంచి ఆయన నాటక ప్రదర్శనల చాయాచిత్రాల ప్రదర్శన, రమేష్‌గౌడ రంగ జీవితంపై పుస్తకం విడుదల, సాంస్కృతిక కార్యక్రమాలు, చర్చాగోష్టి, ఆయనపై వివిధ కళాకారులు, మిత్రుల అభిప్రాయల వీడియో చిత్ర ప్రదర్శన, నాటక రంగ జీవనంపై ఆయనతో సంవాదం, అనంతరం అభినందన కార్యక్రమం జరిగాయి. రమేష్‌గౌడ పాటిల్ అభినందన సమితి ఆధ్వర్యంలో వెండి కిరీటంతో ఆయనను ఘనంగా సత్కరించారు. అనేక సంస్థలు, సంఘాలు, మిత్రులు అభినందనలతో ముంచెత్తారు. ఈ కార్యక్రమంలో రాఘవ స్మారక సంఘం గౌరవ అధ్యక్షుడు చన్నప్ప, అధ్యక్షుడు కోటేశ్వరరావు, బెళగల్లు వీరణ్ణ, చోరనూరు కొట్రప్ప, డా.నాగరత్నమ్మ, హంపయ్య, ఉడేద బసవరాజు, అభినందన సమితి అధ్యక్షుడు సిద్దనగౌడ, ప్రభుదేవ్ కప్పగల్, సిద్ధరామకల్మఠ, మంజునాథ్, కోగళిపంపణ్ణ, నాగరాజు, జయప్రకాష్‌గుప్త, పంపాపతి, ధనంజయ, రామచంద్ర, డా.డి.ఎల్ రమేష్‌గోపాల్, అభినందన సమితి సభ్యులు, ఆర్.ఎం.ఎ సభ్యులు, కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.

# నంద్యాలలో బహ్మాండమైన మెజార్టీతో గెలుస్తాం

**- ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి**



కర్నూలు : నంద్యాల సభలో ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఇష్టమొచ్చినట్టుగా మాట్లాడిన వైఎస్‌జగన్ నోటికి ఎన్నికల సంఘం తాళం వేసినట్టేనని ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి అన్నారు. జగన్ వ్యాఖ్యలను ఎన్నికల సంఘం సుమోటోగా కేసుగా నమోదుచేసి నోటీసులు జారీ చేయడం హర్షణీయమని, ఇక నుంచి జగన్ నోరును అదుపులో ఉంచుకొనేందుకు ఇది చక్కటి గుణపాఠమని అన్నారు. కర్నూలులోని తెదేపా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, శాసనసభ్యులు ఎస్వీ మోహన్‌రెడ్డితో కలిసి ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సంఘం జగన్‌కు నోటీసులు ఇవ్వడంతో నంద్యాల ఉపఎన్నికలు శాంతియుతంగా జరుగుతాయనే తాము నమ్ముతున్నామని, రాజకీయాల్లో నోటికి ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఎన్నికల సంఘం అక్షింతలు వేస్తుందన్నారు. నంద్యాలలో తెదేపా అభ్యర్థి మంచి మెజార్టీతో విజయం సాధిస్తారని పేర్కొన్నారు. నంద్యాలలో మంత్రులు నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం చేస్తున్నారని, వె%కాపా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినా.. మంత్రులు ప్రచారం నిర్వహించుకోవచ్చునని ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చిందని కేఈ తెలిపారు. 2014 ఆగస్టు 15న ముఖ్యమంత్రి జిల్లాకు ఇచ్చిన హామీలు నెరవేరలేదని జగన్ చేసిన వ్యాఖ్యలను కేఈ ఖండించారు. జిల్లాలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని, ఇందులో ఎయిర్‌పోర్టు, మెగా పుడ్‌పార్కు, ఉర్దూ విశ్వవిద్యాలయం, త్రిబుల్‌ఐటీ తరగతులు కొనసాగుతున్నాయని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి పులికనుమ, సిద్ధాపురం, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాలను ఆగస్టు నెలాఖరులో ప్రారంభిస్తారని ఆయన వెల్లడించారు. నంద్యాలను జిల్లా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని, వె%శ్య కార్పొరేషన్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ నంద్యాలలో జగన్, రోజా చేసిన ప్రకటనలు అక్కడి ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు. రోజా ప్రచార తీరుతో తమ పార్టీకే ప్రయోజనం ఉంటుందన్నారు. ఎంఎల్‌సీకి రాజీనామా చేసిన శిల్పా చక్రపాణిరెడ్డి భాష మరింత అధ్వానంగా ఉందని, కల్లుపెంటల వద్ద వాడే భాషతో ఆయన మాట్లాడుతారని చురకలు వేశారు.

మొదటి పేజీ తరువాయి

## నేరస్థులకు శిక్ష పడాల్సిందే

నేరస్థులతో లాలూచీ పడకుండా.. వారికి కచ్చితంగా శిక్ష పడేలా చేయాలి అని రాహుల్ ట్వీట్ చేశారు.

యువతిని వేధించిన కేసులో హరియాణా భాజపా రాష్ట్ర అధ్యక్షుడు సుభాష్ బరాల కుమారుడు వికాస్ బరాలను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. నేను చండీగఢ్ వెళ్లేందుకు నా వాహనంలో ప్రయాణిస్తుండగా కొందరు నన్ను వెంబడిస్తున్నారని అనుమానం వచ్చింది. వెనక్కి తిరిగి చూస్తే ఎస్‌యూవీ (హెచ్‌ఆర్23-జి- 1008) కారులో నన్ను వెంబడిస్తున్నారు. చాలా సార్లు నా వాహనానికి దగ్గరిగా వచ్చారు. నా వెనకే వస్తూ ఇబ్బందికి గురిచేశారు. ఓ చోట నా వాహనానికి ఎదురుగా వారి కారును నిలిపారు. అందులోంచి ఓ వ్యక్తి దిగి నా దగ్గరకి రాబోయాడు. నేను వెంటనే అక్కడి నుంచి తప్పించుకుని పోలీసులకు సమాచారం అందించాను అని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. దీంతో వికాస్, అతడి స్నేహితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. కాగా.. వికాస్ ప్రస్తుతం బెయిల్‌పై విడుదలయ్యారు.

## పన్నీర్ మళ్లీ సీఎం అవుతారు!

భవిష్యత్తులో మరిన్ని ఆందోళనలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు ఆయన తెలిపారు. తిరుచ్చి విమానాశ్రయానికి పన్నీర్ వస్తున్న సమయంలో అక్కడ నిన్న ఓ వ్యక్తి కత్తితో పట్టుబడిన నేపథ్యంలో మాజీ మంత్రి పరంజ్యోతి, మరికొందరు నేతలు ఆయనకు భద్రతగా నిలిచారని తెలిపారు. కత్తితో పట్టుబడిన వ్యక్తిని అన్నాడీఎంకేకు చెందిన స్థానిక కార్యకర్తగా గుర్తించామని చెప్పారు.

## వైద్యో నారాయణో హరిః

ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని వైద్య విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. అన్ని వృత్తుల కంటే వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదన్నారు. వ్యక్తులు ఆరోగ్యంగా ఉంటేనే.. దేశం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. దేవుడికి ప్రముఖులు, పేదలు అన్న తేడా ఉండదని.. వైద్యులు కూడా అలాగే వ్యవహరించాలని సూచించారు.ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నియమాల మేరకు దేశంలో 10.5లక్షల మంది వైద్యులు అవసరం కాగా.. ప్రస్తుతం 6.5లక్షల మంది మాత్రమే ఉన్నారని వెంకయ్యనాయుడు తెలిపారు.

### అందుకే ఇంతవాడినయ్యా

ఉపరాష్ట్రపతి పదవికి ఉన్న ఔన్నత్యాన్ని ఇనుమడింపజేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆ పదవికి ఎన్నికైన ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. శనివారంనాడు జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మూడింట రెండు వంతుల మెజారిటీతో గెలుపొందిన వెంకయ్యనాయుడు సోమవారంనాడు శ్రీవారిని దర్శించుకున్నారు. వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, పార్టీలకు అతీతంగా తనను గెలిపించిన పార్లమెంటు సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలుపుకొంటున్నానని అన్నారు. 'నేనిప్పుడు బీజేపీ మనిషిని కాదు. ఏ పార్టీకి చెందను. మంత్రి పదవికి, పార్టీకి రాజీనామా చేశాను. రెండు మూడు రోజుల్లో పార్లమెంటు సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తాను' అని ఆయన తెలిపారు. ఉపరాష్ట్రపతిగా ఎన్నిక కావడంతో ఇక నుంచి తాను స్వతంత్రుడనని, ఆ పదవికున్న ప్రతిష్టను మరింత ఇనుమడింపజేయడమే తన కర్తవ్యమని అన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా వ్యక్తిగతంగానే తాను శ్రీవారిని దర్శించున్నానని, తన జీవితంలో ఇదొక నూతన అధ్యాయమని చెప్పారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన తాను ఈ స్థాయికి చేరుకోవడం ఆ వేంకటేశ్వరుని అనుగ్రహమేనని, ఇక్కడకు ఎప్పుడు వచ్చినా తాను ఎంతో స్ఫూర్తి పొందుతుంటానని చెప్పారు. ఈనెల 11న ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు ప్రమాణస్వీకారం చేయనున్నారు.

## ఆడబిడ్డలకు అండగా ఉంటా

తెదేపా నేతలు సీతక్క, దూలం రాధిక తదితరులు ఆయనకు రాఖీలు కట్టిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. శ్రావణమాసంలో వచ్చే రాఖీ పౌర్ణమి ఎంతో విశిష్టమైనదని సీఎం అన్నారు. మమతాను రాగాలకు, ప్రేమానుబంధాలకు రాఖీ పండుగ నిదర్శనమని చెప్పారు. రాష్ట్రంలో ఆడబిడ్డలకు తమ ప్రభుత్వం రక్షణ కవచంలా ఉంటుందని పేర్కొన్నారు. ఈవ్ టీజింగ్ చేసేవారిపై, మహిళలను వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆపదలో ఉన్న మహిళల కోసం అభయహస్తం యాప్‌ను రూపొందించినట్లు చెప్పారు. అలాగే రైతాంగానికి శ్రావణ పౌర్ణమి ఒక శుభ సమయమని చంద్రబాబు వెల్లడించారు.

మరోవైపు చంద్రబాబు తనయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు కూడా తెలుగుదేశం మహిళా నేతలు రాఖీలు కట్టారు. తమకంటే వయసులో చిన్నవాడైన లోకేశ్‌ను రాఖీ కట్టి, స్వీట్లు తినిపించి ఆశీర్వదించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నేత, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి సోదరి షర్మిలా రాఖీ కట్టారు. షర్మిలా రాఖీ కడుతున్న ఫొటోను జగన్ ట్విట్టర్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు.

## అక్కచెల్లెళ్లు సుఖంగా ఉండాలి

ఒక విశిష్టమైన పండుగ అని ఆయన తన సందేశంలో పేర్కొన్నారు. ఈ పర్వదినం మన ప్రజల్లో సోదరభావాన్ని, ఐక్యతను చాటాలని ఆకాక్షించారు.

## ప్రతీ ఒక్క ఎకరానికీ సాగునీటికి కృషి

2018 నాటికి గ్రావిటీమీద ప్రాజెక్టు ద్వారా నీర అందించడం జరుగుతుందని అన్నారు. గతంలో మన పూర్వీకులు చేసిన తప్పిదం వలన ప్రోరేటా కృష్ణా జలాలకు అందడం లేదని శ్రీశైలంలో ఇంకా నీరు చేరలేదని అన్నారు. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా గత సంవత్సరం 6 నుండి 7 టిఎంసిలు, 2వ సంవత్సరం 54 నుండి 55 టిఎంసిలు నీరు అందించి కృష్ణా జిల్లాలోల& 14 లక్షల ఎకరాలకు సాగునీరు కల్పించామని అన్నారు.. ఈ సంవత్సం జూన్ లోనే కృష్ణా డెల్టాకు నీరు అందించగా జూన్ 1వ తేదీకి గోదావరి డెల్టాకు నీరు అందించామని అన్నారు. గత సంవత్సరం రబీలో కూడ నీరు ఇచ్చి చరిత్రలోనే బంపర్ క్రాప్ సాధించామని అన్నారు. ఇంతకు ముందు గతంలో రబీకు పూర్తి స్థాయిలో నీరు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. విభజన సందర్భంగా 7 మండలాలకు మనకు విలీనం కావడం వలన సీలేరు ప్రాజెక్టు మనకు వచ్చిందని, సీలేరు జలాలను ప్రణాళికాబద్ధఇగా సద్వినియోగం చేసుకుంటున్నామని అన్నారు. రాబోయే కాలంలో ఖరీఫ్ రబీ సీజన్లకు సకాలంలో సాగునీరు అందిస్తామని తద్వారా తుఫాన్లు వంటి బెడద రైతులకు ఉండదని అన్నారు. పోలవరం ద్వారా ప్రతీ ఎకరాకు నీరు అందిస్తామని, ఆలస్యం అయితే లిఫ్టుల ద్వారా నీరు అందించి జిల్లాను సశ్యశ్యామలం చేయడానికి కృషి చేస్తామని అన్నారు.

పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా 3500 క్యూసెక్కుల నీటిని పోలవరం ఎడమ కాలువకు ఎత్తిపోసి అక్కడి నుండి 60 కిలో మీటర్లు దగ్గర మరో లిఫ్టుద్వారా ఏలేరు 1400 క్యూసెక్కులు తరలించడం జరుగుతుందని ఆయన తెలిపారు. తద్వారా ప్రస్తుతం 13 టిఎంసిల మేరకే నిల్వ ఉంటున్న ఏలేరులో 28 టిఎంసిలు మేరకు నిల్వ ఉంటుందని అన్నారు. తద్వారా ఏలేరు క్రింద 67,614 ఎకరాల ఆయకట్టుకు స్థిరీకరణ జరుగుతుందని అన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి కార్యక్రమం ద్వారా చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా ఏలేరుకు పుష్కర సిస్టమ్‌లో 2 లక్షల 15 వేలు ఎకరాలకు సాగునీరుతో పాటు విశాఖపట్నంకు 10 టిఎంసిలు నీరు అందుతుందన్నారు. పురుషోత్తపట్నం ప్రాజెక్టు మొదటిదశలో చేపట్టిన 10 పంపులకు గాను 2 పంపులను, 1 ప్రెజర్ మెయిన్‌ను ఈ నెల 15వ తేదీ నాటికి పూర్తి చేసి ఎట్టి పరిస్థితులలోనూ ప్రాజెక్టును ప్రారంభించడం జరుగుతుందన్నారు. పిఠాపురం కాలువ చివరి భూములకు సాగునీరు కోసం రైతులు పోరాటాలు చేస్తుంటే గతంలో ఆధునీకరణ పేరున కల్లబొల్లి పాటలు చెప్పి పబ్బం గడిపారని అన్నారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా రైతుల చిరకాల వాంఛ తీరనున్నదని అన్నారు. లక్షలాది క్యూసెక్కుల గోదావరి జలాలు సముద్రానికి తరలిపోతుంటే గోదావరి జిల్లాలు సాగునీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, పుష్కర, పురుషోత్తపట్నం, పట్టిసీమ ద్వారా ఉభయగోదావరి జిల్లాలకే కాక రాష్ట్రంలో మరో ఐదు, ఆరు జిల్లాలకు సాగునీరు అందించే అదృష్టం తనకు కలిగిందని అన్నారు. ఇందుకు జిల్లా రైతులను కూడా అభినందించాలని ఎంతో మంది రెచ్చగొట్టి అడ్డంకులు సృష్టించాలని ప్రయత్నించిన విజ్ఞతతో పూర్తి సహకారాన్ని అందించాలని కొనియాడారు. అందుకే చెప్పిన సమయానికంటే ముందే నీరు అందించేందుకు కృషి చేస్తున్నానని ప్రతీ సోమవారం పోలవరంగా మార్పు చేసుకున్నానని అన్నారు. జిల్లాలో పర్యాటక రంగానికి ఎంతో అవకాశం ఉందని రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్ట్ అభివృద్ధితో కోనసీమ, పాపికొండలు, కాకినాడ పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి కానున్నాయని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు భూసేకరణ నిర్వాసితులకు ప్యాకేజీకింద 30 నుండి 32 వేల కోట్ల ఖర్చు అవుతుందని అలాగే ప్రాజెక్టు నిర్మాణానికి 16 వేల కోట్లు ఖర్చు అవుతుందని ఆయన అన్నారు. ఇప్పటి వరకు 3,500 కోట్లు రాష్ట్రం నిధుల నుండి ఖర్చు చేయడం జరిగిందని దీనిలో రూ. 1,000 కోట్లు కేంద్ర ప్రభుత్వం తిరిగి ఇచ్చేందుకు సిఫార్సు చేయగా నిధులు విడుదల కావలసి ఉందని అన్నారు. నిర్వాసితులను ఎవరినీ బలవంతంగా తరలించడం లేదని అయితే చెప్పుడు మాటలు విని గొంతెమ్మ కోర్కెలు కోరితే అంగీకరించేది లేదని ఆయన స్పష్టం చేశారని అన్నారు. ప్రాజెక్టులు ప్రగతికి చిహ్నాలని, జీవనాడులని ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్రాజెక్టులు పూర్తి చేస్తానని అన్నారు. అంతకు ముందు పురుషోత్తపట్నం పంపు హౌస్ రెగ్యులేటర్లు, పైపు లైన్లు ఎలైన్‌మెంట్ వ్యవస్థలను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఇరిగేషన్ శాఖ ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను, ఎలైన్‌మెంట్ మ్యాప్‌లను తిలకించారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, పార్లమెంటు సభ్యులు మాగంటి మురళీమోహన్, శాసనమండలి ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, ఇరిగేషన్ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్, ఇంజనీరింగ్ చీఫ్ వెంకటేశ్వరరావు, జిల్లా కలెక్టర్ కార్తీకేయ మిశ్రా, శాసనమండలి సభ్యులు ఆదిరెడ్డి అప్పారావు, జిల్లా పరిషత్ ఛైర్మన్ జ్యోతు నవీన్, శాసనసభ్యులు పెందుర్తి వెంకటేష్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఎస్.వి.ఎస్.ఎస్. వర్మ, పిల్లి అనంతలక్ష్మి, దాట్ల బుచ్చిరాజు, పరుపుల సుబ్బారావు, పి. నారాయణమూర్తి, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎన్. వీర్రెడ్డి, డిసిఎంఎస్ ఛైర్మన్ కె.వి. సత్యనారాయణ రెడ్డి, మాజీ శాసనసభ్యులు బండారు సత్యానందరావు, సీతంశెట్టి వెంకటేశ్వరరావు, తదితరులున్నారు. సబ్ కలెక్టర్ వి. విజయరామరాజు, పి.వో. దినేష్ కుమార్, మెగా ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ప్రతినిధి రంగారజన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్వేగానికి లోనైన వెంకయ్య

అలవర్చిందన్నారు. ఉపాధ్యాయులు, నాయకులను పేరుపేరునా గుర్తుచేసుకున్నారు.

**నెల్లూరులో వెంకయ్యకు జననీరాజనం**

ఉపరాష్ట్రపతిగా ఎన్నికై తొలిసారి సొంత జిల్లా నెల్లూరుకు విచ్చేసిన తెలుగుతేజం వెంకయ్య నాయుడుకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. తిరుపతి నుంచి హెలీకాప్టర్‌లో పోలీసు కవాతు మైదానానికి చేరుకున్న ఆయనకు రాష్ట్రమంత్రులు నారాయణ, కామినేని శ్రీనివాస్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కలెక్టర్ ముత్యాల రాజు స్వాగతం పలికారు. పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శాలువాలతో అభినందించారు. అనంతరం పోలీసు కవాతు మైదానం నుంచి వీఆర్సీ కళాశాల వరకు నిర్వహించిన భారీ ర్యాలీలో అడుగడుగునా పూల వర్షం కురిపిస్తూ ప్రజలు సాదరస్వాగతం పలికారు.

రోడ్డుకు ఇరువైపుల త్రివర్ణ రంగుల బెలూన్లు చేతపట్టి విద్యార్థులు అడుగడుగునా పూలు చల్లుతూ స్వాగతం పలికారు. 1500 మీటర్ల జాతీయ జెండాతో విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. నగర వీధుల్లో దారిపొడువునా ప్రజలు వెంకయ్యకు నీరాజనాలు పలికారు. ర్యాలీ అనంతరం ఆత్మీయ అభినందన సభలో వెంకయ్య మాట్లాడారు.

# రాజకీయాలకు అతీతంగా వెంకయ్యకు సత్కారం

బెంగళూరు :ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన తర్వాత తొలి సారిగా కర్ణాటకకు విచ్చేసిన ఎం.వెంకయ్యనాయుడికి రాష్ట్ర ప్రజలు ఆత్మీయంగా స్వాగతం పలికారు. 1998 నుంచి దాదాపు 18 ఏళ్ల పాటు రాష్ట్రం నుంచి రాజ్యసభ సభ్యుడిగా సేవలందించిన ఆయన తాజాగా ఉప రాష్ట్రపతిగా ఎన్నికవటం పట్ల రాజకీయ, విద్య, న్యాయ, వైద్య రంగాలకు చెందిన ప్రముఖులు సత్కరించారు. దేవనహళ్లిలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో అడుగుపెట్టిన వెంకయ్యనాయుడు ప్రైవేటు వాహనంలో ఎక్కకుండానే కాలినడకన బయటకు వచ్చారు. ఎం.పి. పి.సి.మోహన్, భాజపా నేత కట్టా సుబ్రహ్మణ్యం నాయుడు స్వాగతం పలికారు. కన్నడిగులు అందించిన ప్రోత్సాహంతో జాతీయ నాయకుడిగా రాణించానని వెంకయ్య ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. రెండు దశాబ్దాలపాటు రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా రాష్ట్రంలోనే కాకుండా దేశంలోని అన్ని మారుమూల గ్రామాల అభివృద్ధికి కృషి చేసినట్లు చెప్పారు. 3.30 గంటల సమయంలో ఆయన ప్యాలెస్ మైదానానికి చేరుకుని సత్కారం అందుకున్నారు. ఎంపీగా కర్ణాటక సర్వతో ముఖాభివృద్ధికి తోడ్పడిన వెంకయ్యనాయుడు ప్రస్తుతం ఉపరాష్ట్రపతిగా ఎన్నిక కావడం కన్నడిగులు చేసుకున్న అదృష్టమని కేంద్ర రసాయన, ఎరువుల శాఖ మంత్రి అనంతకుమార్ సత్కార వేదికపై అన్నారు. నాజూకు నగరాలతో పాటు స్వచ్ఛభారత్, ప్రధాన మంత్రి సడక్ యోజనలు ప్రజాదరణ పొందటంలో వెంకయ్య నాయుడి పాత్ర అపారమని గుర్తుకు చేసుకున్నారు. ఇంత వరకు రాష్ట్ర ప్రతినిధిగా ఉన్న ఆయన- దేశానికి రెండో పౌరుడిగా బాధ్యతలు చేపట్టడం రాష్ట్ర ప్రజలకు రెట్టింపు ఉత్సాహాన్నిచ్చిందన్నారు.

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు యడ్యూరప్ప మాట్లాడుతూ గతంలో కర్ణాటకలో భాజపా అధికారం చేపట్టడంలో వెంకయ్య నాయుడు చేసిన కృషిని ఆయన గుర్తు చేసుకున్నారు. భాజపా రాష్ట్ర వ్యవహారాల బాధ్యుడు మురళీధర రావ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలతో వెంకయ్యనాయుడికి ఉన్న అనుబంధం మరింత పెరిగిందన్నారు. కార్యక్రమంలో పీఈఎస్ విద్యా సంస్థల అధ్యక్షుడు డాక్టర్ ఎం.ఆర్.దొరెస్వామి, వెంకయ్యనాయుడు అభినందన సమితి అధ్యక్షుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎం.ఎన్.వెంక టాచలయ్య పాల్గొన్నారు.

విజయవాడ ప్రాంతీయ వార్తలు

# ఆశా కార్యకర్తలకు కనీస వేతనం ఇవ్వాలి

ఫత్తేఖాన్‌పేట : ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలని, కార్మికులుగా గుర్తించాలని పాత బకాయిలు వెంటనే చెల్లించాలని, పీహెచ్‌సీల్లో వ్కెద్య ఆరోగ్యసేవలు మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21న చలో దిల్లీ కార్యక్రమం చేపడుతున్నట్లు ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షురాలు దుగ్గిరాల అన్నపూర?మ్మ తెలిపారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదేళ్లుగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఆశా కార్యకర్తలకు వేతనాలు ఇవ్వక వెట్టిచాకిరి చేయిస్తున్నాయని తెలిపారు. ఎన్నోసేవలు అందిస్తున్న వీరంతా పూటగడవక ఎన్నో ఇబ్బందులు పడు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దిల్లీ నడివీధిలో ప్రభుత్వాలను నిలదీస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె.విజయలక్ష్మి, అధ్యక్షురాలు కె.లక్ష్మి, ఆర్.అరుణ, టి.వరలక్ష్మి, మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

# చెరువులో రహదారి నిర్మాణంపై రైతుల ఆగ్రహం

సున్నపుబట్టి : మండలంలోని సున్నపుబట్టి చెరువులో రహదారి నిర్మాణం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై రైతులు కొద్ది రోజులుగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుల అభిప్రాయాలను లెక్క చేయకుండా ఏపీఐఐసీ వారు రహదారి నిర్మిస్తుండడంతో రైతులు మరోమారు పనులను అడ్డుకొన్నారు.

ఈ విషయమై తహశీల్దార్ జయ ప్రకాష్‌తో పాటుగా ఏపీఐఐసీ జోనల్ అధికారి వెంకటేశ్వర్లు రైతులతో మాట్లాడారు. అయినా రైతులు మాత్రం చెరువుకు అడ్డంగా రహదారి నిర్మించడానికి ఒప్పుకోలేదు. సున్నపుబట్టి చెరువు నీటి ద్వారా 300 ఎకరాల ఆయకట్టు సాగులో ఉంది. చెరువుకు వర్షపు నీరే ఆధారం. ఈ క్రమంలో చెరువుకు దక్షిణంగా ఉన్న ప్రాంతాల నుంచి వర్షపు నీరు చెరువులోకి చేరుతోంది. ఇప్పుడు ఈ నీరు చెరువులోకి ప్రవేశకుండా అడ్డంగా రహదారి నిర్మిస్తున్నారు. ఈ రహదారిని నిర్మిస్తే చెరువులోకి చుక్కనీరు చేరదని సాగునీటి సంపుం అధ్యక్షుడు శీనయ్య తెలిపారు. ఏపీ ఐఐసీ అధికారులు రైతుల ఇబ్బందులను పట్టించుకోకుండా చెరువులోకి నీరు రాకుండా రహదారి నిర్మించడం ఎంత వరకూ సబబని వారంటున్నారు. రహదారి నిర్మాణానికి సాగు నీటి శాఖ అధికారులు ఎలాంటి అనుమతులు కూడా ఇవ్వ లేదని రైతులు చెప్పారు. ఈ విషయమై తహ శీల్దార్ జయప్రకాష్‌ను వివరణ కోరగా రైతులు చెరువులో రహదారి నిర్మాణానికి అభ్యం తరం చెబుతున్నారని చెప్పారు.

# జీఎస్‌టీ పన్ను విధానం ప్రజలకెంతో ప్రయోజనం: సినీ నటుడు నాగినీడు



నెల్లూరు : నల్లధనాన్ని అదుపు చేసేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్‌టీ పన్నువిధానం ఎంతగానో దోహదపడుతోందని సినీ నటుడు (మర్యాదరామన్న చిత్రం ఫేం) వి.నాగినీడు పేర్కొన్నారు.

నెల్లూరు నగరం ఇస్కాన్‌సిటీ సమీపంలోని సౌత్ ఇండియన్ కల్చరల్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెల్లూరుకు సిక్కా ఇండ్రస్టీ రావడం సంతోషదాయకమన్నారు. జీఎస్‌టీ పన్ను విధానం ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని చెప్పారు. తెలుగులో ఎమ్మెల్యే, నాని నటిస్తున్న మరో చిత్రం, పేపర్‌బోయ్ చిత్రాలతోపాటు, తమిళ చిత్రాల్లోనూ నటిస్తున్నట్లు చెప్పారు. మర్యాదరామన్న చిత్రంలో తన నటనకు మంచి పేరు వచ్చిందని చెప్పారు.

అలాగే మిర్చి, అహనాపెళ్లంట చిత్రాల్లో గుర్తింపు వచ్చిందని, నెల్లూరీయులు తనపై చూపుతున్న అభిమానాన్ని ఎప్పటికీ మరచిపోలేనన్నారు. ఈ కార్యక్రమంలో సిక్కా సభ్యులు వెంకట్రావ్, కె.వెంకటరమణ, నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రానైట్ క్వారీల్లో భద్రతా వారోత్సవాలు

## 20న ముగింపు వేడుక

చీమకుర్తి : ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలో విస్తరించిన గ్రానైట్ గనుల్లో ఈ నెల 7 నుంచి 12 వరకు భద్రతా వారోత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు చీమకుర్తి, గురిజేపల్లి, బల్లికురవ, నాదెండ్ల ప్రాంతాల్లోని క్వారీల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీటిని మూడు విభాగాలుగా విభజించి వేడుకలు నిర్వహించనున్నారు. వారోత్సవాల నిర్వహణకు ఇప్పటికే కమిటీని ఏర్పాటు చేశారు. ట్రేడ్ పరీక్షలు సైతం ముగిశాయి. ఇతర అంశాలను ప్రత్యేక బృందాలు పరిశీలించి గ్రేడ్‌లు కేటాయించ నున్నాయి. వారోత్సవాల ముగింపు, బహుమతి ప్రదానోత్సవ సభ ఈ నెల 20న ఒంగోలులో నిర్వహించనున్నారు.

గెలాక్సీ గ్రానైట్‌కు నిలయమైన చీమకుర్తి, స్టీల్‌గ్రే గ్రానైట్‌ను వెలికి తీస్తున్న బల్లికురవ, బ్లాక్ పెరల్ గ్రానైట్ నిక్షపాలు ఉన్న గుంటూరు జిల్లా పరిధిలోని గురిజేపల్లి, నాదెండ్ల తదితర ప్రాంతాల్లోని 85కి పైగా గ్రానైట్ క్వారీల్లో భద్రతా వారోత్సవాలు నిర్వహించనున్నారు. వారోత్సవాల నిర్వహణ కమిటీకి గనుల భద్రతా విభాగం సంయుక్త సంచాలకులు నీరజ్‌కుమార్ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. 18వ వారోత్సవాలకు ఆతిథ్య బాధ్యతలు చేపట్టిన మిడ్‌వెస్ట్ గ్రానైట్స్ డ్కెరెక్టర్ ఎం.రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షులుగా, పెరల్ గ్రానైట్స్ యజమాని చలువాది నాగరాజ ఉపాధ్యక్షులుగా, బి.అనిల్‌రెడ్డి (మిడ్ వెస్ట్) కార్యదర్శిగా వ్యవహరించనున్నారు. ఆయా క్వారీలకు చెందిన 15 మందితో నిర్వహణ కమిటీని ఏర్పాటు చేశారు.

ముగిసిన ట్రేడ్ టెస్ట్‌లు...

భద్రతా వారోత్సవాల సన్నాహంగా నిర్వహించే వివిధ రకాల ట్రేడ్‌టెస్ట్‌లు ఇప్పటిఇకే ముగిశాయి. రామతీర్థంలోని వ ృత్తి శిక్షణ కేంద్రంలో ఈ ట్రేడ్ పరీక్షలు నిర్వహించారు. వారోత్సవాల్లో ఆయా క్వారీల్లోని పలు అంశాలను పరిశీలించేందుకు వివిధ గనులకు చెందిన ప్రతినిధులు, మేనేజర్లతో కమిటీలు ఏర్పాటు చేస్తారు. ఈ బ ృందాలు ముందుగా నిర్ణయించిన ప్రకారం ఆయా క్వారీలను సందర్శించి... గనుల్లో ర్యాంపులు, బెంచ్‌ల నిర్వహణ, ప్రథమ చికిత్స ఏర్పాట్లు, భద్రతా పరికరాల వినియోగం, యంత్రాలు, రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణ తదితర భద్రతాంశాలను పరిశీలిస్తాయి. ఈ నెల 20న ఒంగోలులో ముగింపు వేడుకలు నిర్వహించనున్నారు. గనుల భద్రతా విభాగం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ దత్తా, భూగర ్ గనుల శాఖ ఉన్నతాధికారులు హాజరు కానున్నారు.

# ఎన్నికల అక్రమాలపై ప్రతి పౌరునికి బాధ్యత

## నంద్యాలలో ఎన్నికల నిఘా వేదిక ప్రచారం




తలనంద్యాల : ఎన్నికల్లో రాజకీయ పార్టీలు, నాయకులు నిబంధనల ఉల్లం ఘనల్ని పరిశీలించేందుకు వచ్చిన కొందరు అధికారులు సైతం రాజకీయ పార్టీలతో కుమ్మక్కై ఉదాసీనంగా వ్యవహరిస్తే వారి పట్ల ప్రతి పౌరుడు ఎన్నికల కమిషన్ వేగుగా పని చేయాలని భారత ఎన్నికల కమిషన్ పూర్వ సలహాదారు కేజే రావు పేర్కొన్నారు. నంద్యాలలో ఆదివారం భగత్‌సింగ్ గ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ ఎన్నికల నిఘా వేదిక కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిఘా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏపీ ఎన్నికల నిఘా వేదిక కమిటీ కన్వీనర్ వి.లక్ష్మణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో కేజే రావు మాట్లాడుతూ.. డబ్బు, మద్యం, కులం, సామాజిక వర్గం వంటి అంశాలను తీసుకుని ఎలాగోలా ఎన్నికల్లో గెలవాలని కొందరు అభ్యర్థులు ప్రయత్నిస్తారని, వీటి పంపిణీ సమయంలో ప్రజలు కమిషన్‌కు ఫిర్యాదు చేసే అవకాశముందన్నారు. ఎన్నికల నియమావళిపై పర్యవేక్షించేందుకు ఎన్నికల కమిషన్ కొందరు స్థానిక అధికారులను నియమిస్తారని కానీ వారు కూడా కొన్నిచోట్ల పార్టీలతో కుమ్మక్కైతే వారిపై కూడా ఫిర్యాదు చేసే హక్కు ఉందన్నారు. ఎన్నికలను స్వేచ్ఛగా నిర్వహించేందుకు రిటర్నింగ్ అధికారు లకు ఉన్న పూర్తి అధికారాలను వినియోగిస్తే నిష్పక్షపాతంగా ఎన్నికలను జరపవచ్చన్నారు. బిహార్ ఎన్నికల సమయంలో నిర్వహించిన విధులపై ఆయన తన అనుభవాలను తెలిపారు. రాష్ట్ర కన్వీనర్ వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల నిఘా వేదిక సమాచారం ప్రకారం నంద్యాలలో అభ్యర్థులు పెట్టే ఖర్చు రూ.150 కోట్ల మేర ఉంటుందని పేర్కొన్నారు. ఇదంతా ప్రజల డబ్బేనన్నారు. ఈ నెల 23 వరకు ఎన్నికల నిఘా వేదిక అనుక్షణం అప్రమత్తంగా ఉండి ప్రభుత్వ అధికారులపై కూడా నిఘా పెడుతుందన్నారు. ఈ సమావేశంలో న్యాయవాది బి.శంకరయ్య, విశ్రాంత తహసీల్దార్ సయ్యద్ రోషన్ అలి, ఓపీడీఆర్ రాష్ట్ర కార్యదర్శి చిమ్మె జాన్‌బర్నబాస్, సమాచార హక్కు చట్టం ఉద్యమ నాయకుడు ఎన్‌కే జయన్న, బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి ఎన్.శ్రీనివాసులు, న్యాయవాది శ్రీనివాసమూర్తి, విశ్రాంత డీఎస్పీ పాపారావు, సీనియర్ సిటిజన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఈశ్వరప్ప, కడప జిల్లా ఎన్నికల నిఘా వేదిక కన్వీనర్ సురేష్ తదితరులు మాట్లాడారు. ఎన్నికల అక్రమాలపై స్పందించేందుకు ఎన్నికల నిఘా వేదిక 9949930670 చరవాణి నంబరుకు, 1950 టోల్‌ఫ్రీ నంబరుకు, ఫ్యాక్స్ ద్వారా సమాచారాన్ని 040 23455781 నంబరుకు తెలియజేయవచ్చని, 9223166166 నంబరుకు ఎస్ఎంఎస్ కూడా పంపవచ్చని తెలిపారు. అనంతరం సాయిబాబానగర్, ఆస్పత్రి, నూనెపల్లె ప్రాంతాల్లో ఎన్నికల నిఘా వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

## అట్టహాసంగా ప్రారంభమైన

# రాఘవేంద్రస్వామి 346వ ఆరాధన సప్తరాత్రోత్సవాలు

మంత్రాలయం : తుంగభద్ర తీరంలో.. మంచాలమ్మ సన్నిధిలో కొలువైన జగద్గురు శ్రీ రాఘవేంద్రస్వామి 346వ ఆరాధన సప్త రాత్రోత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు వేద పండితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య ధ్వజారోహణం చేశారు. ఉత్సవాలను పురస్కరించుకొని స్వామి మూలబృందావనానికి, గ్రామదేవత మంచాలమ్మకు మంగళ హారతులిచ్చారు. వూరేగింపుగా చేరుకున్న పీఠాధిపతి మఠం ఎదుట గోవు, గజ, అశ్వాలకు పూజలు నిర్వహించారు. మఠంపై కాశాయం రంగుజెండా ఎగరవేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. యోగీంద్ర సభా వేదికపై జ్యోతిని వెలిగించి సాంస్కృతిక కార్యక్రమాలను ఆరంభించారు.

స్వర్ణ మండపంపై మూలరాములకు పూజలు : నిత్యపూజితుడైన మూల రాముడు, దిగ్విజయరాముడు, జయరాముడు, సంతాన గోపాలకృష్ణ, వైకుంఠ వాసుదేవత మూర్తుల ప్రతిమలను బంగారు మండపంలో ఆశీనులు చేసి పీఠాధిపతి పూజలు నిర్వహించారు. పూలు, పల్లతో అలంకరించిన మండపంలో స్వామిని బంగారు ఆభరణాలు, వైఢూతర్యాలతో ముస్తాబు చేసి దూపదీప నైవేద్యాలను సమర్పించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ప్రహ్లాదరాయలను కనకంతో అభిషేకించి పల్లకిలో వూరేగించారు. పట్టువస్త్రాలు, బంగారు కవచం, ప్రత్యేకంగా తెప్పించిన పూలతో స్వామి మూల బృందావనాన్ని అలంకరించి హారతులిచ్చారు. గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు ముందుగా అమ్మవారిని, బృందావనాన్ని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆదోని రెండో అదనపు న్యాయమూర్తులు శ్రీనివాసరావు, సాయిరాం స్వామి దర్శనార్థం మఠానికి వచ్చారు. వీరికి శ్రీమఠం అధికారులు స్వాగతం పలికారు. అనంతరం వీరిని పీఠాధిపతి ఆశీర్వదించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు : యోగీంద్ర సభావేదికపై నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు అలంరించాయి. బెంగళూరికి చెందిన అక్కాచెల్లెళ్లు కుమారి రక్షిత, శ్రీకృప, హుబ్లీకి చెందిన విద్వాన్ బాలచంద్రనకోడ్‌లచే దాసవాని కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం బెంగళూరికి చెందిన విదూషి దీపాభట్ నృత్య బృందం చేసే నృత్యరూపకం భక్తులను ఆకట్టుకొంది.

రాఘవేంద్రులే నడిపిస్తారు : ఉత్సవాలను వైభవంగా కొనసాగడానికి రాఘవేంద్రస్వామే ముందుండి నడిపిస్తారని పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు అన్నారు. ప్రారంభోత్సవంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఏడు రోజుల పాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీమఠం అధికారులు మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, సహాయ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, సంస్కృత విద్యాపీఠం ప్రిన్సిపల్ ఎన్.వాదీరాజచార్, హరిస్వామి, సీపీ స్వామి, ఉరుకుంద బోర్డు కమిటీ సభ్యుడు వ్యాసరాజచార్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో భారీ పరిశ్రమల స్థాపనకు కృషి

## ఏపీఐఐసీ ఛైర్మన్ పి.క్రిష్ణయ్య



వెంకన్నపురం :జిల్లాలో భారీ పరిశ్రమలను నెలకొల్పేందుకు క ృషి చేస్తున్నట్లు ఏపీఐఐసీ ఛైర్మన్ పి.క్రిష?య్య తెలిపారు. కొడవలూరు మండలంలోని వెంకన్నపురంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హరియాణ రాష్ట్రంతో పోటీపోడి కొడవలూరు మండలంలోని చంద్రశేఖరపురం వద్ద ప్రతిష్టాత్మకమైన కేంద్రప్రభుత్వ మిథాని (మిశ్రమ ధాతు నిగమ్) కంపెనీని తీసుకొని వచ్చామన్నారు. ఇక్కడ కేంద్రం సుమారు రూ.3100 కోట్ల పెట్టుబడితో పరిశ్రమను స్థాపించనున్నట్లు ఆయన వివరించారు. రైతుల నుంచి ఎకరా భూమిని రూ.10 లక్షల చొప్పున ఏపీఐఐసీ కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఇది కేంద్రప్రభుత్వ పరిశ్రమ కావడంతో ఎలాగైనా తమ ప్రాంతానికి తీసుకురావాలనే ఉద్దేశంతో ఆ పరిశ్రమకు ఎకరా రూ.4 లక్షల చొప్పున 110 ఎకరాలను కేటాయించినట్లు తెలిపారు. ఇదంతా ఎస్ఐపీబీ (స్టేట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రామోట్ బోర్డు) చూసుకుంటుందని తెలిపారు. మరో వారం రోజుల్లోగా మిథాని కంపెనీ శంకుస్థాపన చేస్తుందన్నారు. రాచర్లపాడులో గమేసా కంపెనీకి ఎదురుగా గెస్ట్ యాంప్ కంపెనీకి 65 ఎకరాలను కేటాయించామన్నారు. ఇక్కడ రూ.200 కోట్లతో పరిశ్రమను త్వరలోనే నెలకొల్పనున్నట్లు చెప్పారు. ఇక్కడ విండ్‌పవర్ ఫ్యాన్ల పిల్లర్లను తయారు చేస్తారన్నారు. క ృష?పట్నం వద్ద క్రిభ్‌కో కర్మాగారానికి 150 ఎకరాలను కేటాయించగా రూ.2 వేల కోట్ల పెట్టుబడితో పరిశ్రమను నెలకొల్పే పనులు మరో పది నెలల్లోగా ప్రారంభవుతాయన్నారు. ఇదే ప్రాంతంలో కంటైనర్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా కంపెనీ స్థాపనకు త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. క ృష?పట్నం ప్రాంతంలో కోస్టల్ ఎంప్లాయ్‌మెంట్ జోన్‌ను ఏర్పాటు చేసేందుకు 4,500 ఎకరాల భూములను ఇచ్చినట్లు చెప్పారు. ఇటీవల నీతి ఆయోగ్ కమిటీ కూడా స్థల పరిశీలన చేసి వెళ్లిందన్నారు. దేశంలోని ఐదు రాష్ట్రాలతో పోటీపడి అనంతపురంలో ప్రఖ్యాత కియో మోటార్స్ కంపెనీని నెలకొల్పేందుకు ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందన్నారు. సుమారు రూ.11వేల కోట్ల పెట్టుబడితో పరిశ్రమను స్థాపించనున్నట్లు చెప్పారు. ఈ పరిశ్రమను స్థాపించేందుకు ప్రభుత్వం సుమారు రూ. 7,100 కోట్ల మేర రాయితీలను కల్పిస్తున్నట్లు తెలిపారు. వ్యాట్ మినహాయింపు, రూ.3 లకే యూనిట్ విద్యుత్తు, భూ వసతి, ఇతర మౌలిక వసతులను కల్పించనున్నట్లు తెలిపారు. ఆ పరిశ్రమకు కేటాయించిన భూమిని చదును చేయడానికే ప్రభుత్వం రూ.177 కోట్లు ఖర్చు పెడుతుందన్నారు. భారీ పరిశ్రమల స్థాపన వల్ల తక్కువ ఉద్యోగాలు వచ్చినాగాని, దానికి అనుబంధ రంగాల్లో ఎక్కువగా ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. అందుకే ప్రభుత్వం అలాంటి భారీ పరిశ్రమలకు ఎదురు పెట్టుబడులు పెట్టి పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు క ృషి చేస్తుందన్నారు. త్వరలో వాటి ఫలాలు రాష్ట్ర ప్రజలకు అందుతాయన్నారు. అనంతపురంలో మరో ప్రముఖ భెల్ (బీఈఎల్) పరిశ్రమను స్థాపించేందుకు ఏపీఐఐసీ 900 ఎకరాలను కేటాయించినట్లు తెలిపారు.

# మహిళల గళాలు ప్రతిధ్వనించాలి

## శిద్దా లక్ష్మీపద్మావతి

ఒంగోలు : నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం (నరసం) గౌరవాధ్యక్షురాలిగా, ఉపాధ్యక్షురాలిగా ఎంపికైన తేళ్ల అరుణ, సింహాద్రి జ్యోతిర్మయిని జిల్లా రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో వివిధ కళా, సాహిత్య సంస్థలు ఘనంగా సత్క రించాయి. ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు, గౌరవాధ్యక్షుడు మిడసల మల్లికార్జునరావు, ప్రధాన కార్యదర్శి కుర్రా ప్రసాద్‌బాబు నిర్వాహకులుగా వ్యవహరించగా- మంత్రి శిద్దా రాఘవరావు సతీమణి లక్ష్మీపద్మావతి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళల శక్తి అనంతమైనదని, పురాణాలు సైతం స్త్రీని శక్తి స్వరూపిణిగా అభివరి?ంచాయని అన్నారు. జిల్లా నుంచి ఇద్దరు మహిళలకు నవాంధ్ర రచయిత్రుల సంఘం రాష్ట్ర కార్యవర్గంలో స్థానం లభించడం సంతోషదాయకమకన్నారు. అరుణ, జ్యోతిర్మయి తమ రచనలు, కార్యక్రమాల ద్వారా నారీ వాణిని బలంగా వినిపించాలని ఆకాంక్షించారు. విశిష' అతిథిగా పాల్గొన్న డీఎస్పీ గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలు లేనిదే ప్రపంచానికి మనుగడ లేదన్నారు.

సాహిత్య రంగంలో అనాది నుంచి వారి ప్రతిభను మనం చూడవచ్చన్నారు. సన్మాన గ్రహీతలు అరుణ, సింహాద్రి జ్యోతిర్మయి ప్రసంగిస్తూ తమ సంస్థకు మహిళా కమిషన్ అధ్యక్షురాలు నన్నపనేని రాజకుమారితో పాటు వివిధ జిల్లాల నుంచి కవయిత్రులు కార్యవర్గ, పాలకవర్గ సభ్యులుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. తమ సంస్థ అన్ని వాదాల రచనలకు వేదికగా నిలుస్తుందన్నారు. త్వరలో కళాశాల విద్యార్థినులతో కవిత్వ కార్యాచరణశాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. తెదేపా మహిళా ప్రతినిధులు ఆర్ల వెంకటరత్నం, తమ్మినేని మాధవి, నాళం నరసమ్మ, సీనియర్ రచయిత్రి పి.రాజ్యలక్ష్మి, సూర్యకుమారి మహిళా సాహిత్య ప్రస్థానాలను విశ్లేషించారు. ప్రజా కళా వేదిక అధ్యక్షుడు వెల్లంపల్లి ఆంజనేయులు, జిల్లా సంగీత కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు కంచర్ల రతన్, ఎస్.కె.బాబు, గాయనిలు శైలజ, చల్లా నాగేశ్వరమ్మ, శేషారత్నం, కందుకూరు మహతి సంస్థ ప్రతినిధి తన్నీరు బాలాజీ, రంగుల సంధ్య, అచ్యుత్, జిల్లా ట్రాన్స్ జెండర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు దుర్గ, ఐనంపూడి నరసింహం, మాగంటి శ్రీనివాసమూర్తి, తదితరులు సన్మాన గ్రహీతలను సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా చందూ డాన్స్ అకాడమీకి చెందిన 40 మంది చిన్నారులు త్రోవగుంట చందు దర్శకత్వంలో ప్రదర్శించిన 'కృష్ణవేణి చరిత్రం' నృత్య రూపకం అలరించింది.

# పీవీఆర్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఒంగోలు: ఒంగోలులోని పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల 1985-86 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. సుమారు 50 మంది పూర్వ విద్యార్థులు పాఠశాలకు చేరుకుని కేక్ కోసి సంబరాలు జరుపుకొన్నారు. అలనాటి మధుర జ్ఞాపకాలను, ప్రస్తుత పరిస్థితులను చర్చించుకుంటూ ఉత్సాహంగా గడిపారు. నిర్వాహకులు ఈదర సురేష్‌బాబు, తాతా రామకృష్ణ, రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఈ ఏడాది పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు ఇవ్వాలని నిర?యించామన్నారు. దీనికి పూర్వ విద్యార్థులు పేర్ల శ్రీనివాస్, ప్రశాంత్‌లు సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు హైమావతి, సీత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ దృష్టికి బీసీల సమస్యలు

నెల్లూరు : ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి వేలాది మంది అభిమానులు ఉన్నారు. రాష్ట్ర విభజన కారణంగా చాలామంది మనస్థాపం చెంది ఉన్నారని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెంచలబాబు యాదవ్ అన్నారు. ఇదే విషయం ఎఐసీసీ ఉపాధ్యక్షులు రాహుల్‌గాంధీ ద ృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఈ మేరకు దిల్లీలో ఆంధ్రా, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల బీసీ నేతలతో రాహుల్‌గాంధీ సమావేశానికి రాష్ట్రం నుంచి తాను ప్రతినిధిగా వెళ్లానని తెలిపారు.

# విజయభాను

## సంపాదకీయం

### స్థిరాస్థి రంగ నియంత్రణ

ఇంతకాలం స్థిరాస్తి రంగంలో మోసాలు ఉంటాయని జడుసుకొని దూరం ఉన్న మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి కొనుగోలుదార్లు ఇప్పు డు ధైర్యంగా ముందుకు వస్తారు. పట్టణ ప్రాంతంలో ఉండే నిర్మాణ ప్రాజెక్టులను తనిఖీ చేసుకొని ధైర్యంగా కొనుక్కోవచ్చు. స్థిరాస్తి రంగంలో ఉండే మోసాల వల్ల ఇతర రంగాలలో మదుపు చేసిన వారు, ఇప్పుడు ఈ వైపు దృష్టి సారిస్తారు. దీనివల్ల క్రమంగా రియల్ ఎస్టేట్ రంగం మరింత బలపడుతుంది. స్థిరాస్తి వ్యాపార రంగం పద్ధతి ప్రకారం జరుగడం అన్ని పక్షాలకూ శ్రేయోదాయకం. స్థిరాస్తి రంగ నియంత్రణకు, అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన నిబంధనలు ప్రశంసనీయంగా ఉన్నాయి. కొత్త నిబంధనలు స్థిరాస్తి కొనుగోలుదారులకు మోసాలు జరుగకుండా భరోసా కల్పిస్తున్నయి. ఈ రంగంలో మోసాలను అరికట్టడానికి నిబంధనలను కట్టుదిట్టం చేస్తూనే, వ్యాపారాభివృద్ధికి దోహదపడటం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే స్థిరాస్తి నియంత్రణ చట్టాన్ని (రెరా) తెచ్చిన కేంద్రం వీటిని రాష్ట్రాలు అమలు చేయడానికి మూడు నెలల వ్యవ ధి ఇచ్చింది. అయితే కొన్ని రాష్ట్రాల్లో ఈ చట్టం స్పష్టంగా లేకపోవడంతోపాటు ఇతర్రతా విమర్శలు ఉన్నాయి. కానీ తెలంగాణ రాష్ట్రం అమలులోకి తెచ్చిన కొత్త నిబంధనలు మాత్రం స్పష్టం గా మోసాలకు తావివ్వకుండా ఉన్నాయి. కేంద్ర చట్టంలో కనీస మార్పులు మాత్రమే చేసి వీలైనంత వరకు యథాతథంగా అమలు చేయడంలో తెలంగాణ ప్రభుత్వం సఫలమైంది. కొత్త నిబంధనల వల్ల స్థిరాస్తి వ్యాపారంలో పారదర్శకత, జవాబుదారీతనం నెలకొంటుంది. స్థిరాస్తి రంగమంటేనే అనేక చిక్కులతో కూడుకున్నదనీ, మోసాలు ఉంటాయని కొనుగోలు దారులు భయపడుతూ ఉంటారు. ఇంతకాలం ఇంటి స్థలం లేదా ఇల్లు కొనుగోలుదారులు మోసపోతే వెంటనే వారిని ఆదుకునే దిక్కులేదు. జీవితకాలమంతా కష్టపడి కూడబెట్టుకున్న సొమ్ముతో ఎక్కడైనా ఇంటి స్థలం కొని, ఇల్లు కట్టుకొని ప్రశాంతంగా గడుపాలని వృద్ధులు కోరుకుంటారు. తీరా స్థలం కొన్న తరువాత మరొకరు వచ్చి తమదని అనవచ్చు. లేదా అధికారులు వచ్చి అది పార్క్ స్థలమని లేదా మరొకటని అభ్యంతరం చెప్పవచ్చు. ఇట్లా వ్యాపారుల చేతిలో మోసపోయిన ఉదంతాలు అనేకం ఉన్నాయి. కష్టార్జితం కోల్పోయిన బాధ జీవితాంతం మనసును తొలుస్తూ ఉంటే, వృద్ధాప్యంలో నీడలేని బతుకవుతుంది. ఇటువంటి మోసాలు జరుగకుండా తాజా నిబంధనలను రూపొందించారు. ఇంతకాలం స్థిరాస్తి వ్యాపారులు మోసం చేస్తే శిక్షించడానికి చట్టాలు ఉన్నాయి. అయితే కొనుగోలుదారులు న్యాయం పొందడం దీర్ఘకాల ప్రయాస. ఇప్పుడు మోసాలను ముందుగానే అరికట్టే విధంగా కొత్త నిబంధనలున్నాయి. ఇప్పుడు స్థిరాస్తి వ్యాపారి ముందుగా తమ ప్రాజెక్టును నమోదు చేయించుకొని అన్ని అనుమతులు పొందేవరకు ఒక్క అమ్మకం కూడా జరుపడానికి వీలులేదు. కనీ సం ప్రకటనలు చేయడానికి కూడా వీలులేదు. స్థిరాస్తి వ్యాపార సంస్థ తమ వివరాలన్నిటినీ రెరా వెబ్‌సైట్‌లో పొందుపరుచవలసి ఉంటుంది. ప్లాటు, ఇల్లు లేదా అపార్ట్‌మెంట్ కొనుక్కోవాలనుకునే వారు సంబంధిత వెబ్‌సైట్‌లో ప్రాజెక్టుకు సం బంధించిన వెబ్‌సైట్ చూసి వివరాలన్నీ తెలుసుకోవచ్చు. నిర్మాణ ప్రాజెక్టు చేపడుతున్న స్థిరాస్తి సంస్థ జాతకం అంతా వెబ్‌సైట్‌లో ఉంటుంది. నిర్మాణ ప్రాజెక్టు ప్రణాళిక, అనుమతులు, భూమి రికార్డు లు, ప్రాజెక్టు ప్రమోటరు ఫోటోలతో సహా వివరాలన్నీ అందులో ఉంటాయి. నిర్మాణ సంస్థ మూడేం డ్ల బ్యాలెన్స్‌షీట్లు, వార్షిక నివేదికలు కూడా ఉంటా యి. దీనివల్ల ఆయా సంస్థలను నమ్మవచ్చా లేదా అనేది కొనుక్కునేవ్యక్తి నిర్ధారించుకుంటా డు. అనుమతి లేకుండా ప్రకటనలు ఇచ్చినా, అమ్మినా నిర్మాణ ప్రాజెక్టులో పది శాతం అపరా ధ రుసుము చెల్లించవలసి ఉంటుంది. అదే నేరం మళ్ళా చేస్తే మూడేండ్లు ఖైదు అనుభవించవలసి వస్తుంది. రియల్ ఎస్టేట్ ఏజెంట్లు (లేదా కన్సల్టెన్సీ సంస్థలు) కూడా రిజిస్టరు చేయించుకోవలసి ఉంటుంది. మోసాలకు పాల్పడితే రిజిస్ట్రేషన్ రద్దవుతుంది. దీనివల్ల దళారులు తాము అమ్ముతున్న ప్లాట్లు, ఇండ్లు అనుమతులు గలవేనా అనేది నిర్ధారించుకుంటారు. దళారుల మాటలు నమ్మి కొనుక్కునే వారు మోసపోవడం ఉండదు. కొత్త నిబంధనలు అమలులోకి రావడం వల్ల స్థిరాస్తి వ్యాపార రంగం మార్పులకు లోనవుతుంది. ఇందుకు కొంత సమయం పడుతుంది. అంతే తప్ప దీనివల్ల వ్యాపారం దెబ్బతినడమంటూ ఉండదు. రాతోరాత్ రియల్ ఎస్టేట్ వ్యాపారిగా అవతారం ఎత్తి, నియమ నిబంధన లు పాటించి తీరాల్సిందే..

## చైనా కూతలే తప్ప.. యుద్ధం చేయకపోవచ్చు!

న్యూఢిల్లీ: డోక్లామ్ ప్రతిష్టంభనపై చైనా రోజుకో రెచ్చగొట్టే వ్యాఖ్య చెస్తున్నప్పటికీ ఆ దేశం భారత్‌పై యుద్ధానికి దిగకపోవచ్చునని కేంద్ర రక్షణశాఖ భావిస్తోంది. డోక్లామ్ నుంచి భారత సైనికులను తరిమికొట్టేందుకు 'చిన్నపాటి మిలిటరీ ఆపరేషన్'ను సైతం అది చేపట్టే అవకాశం తక్కువేనని రక్షణశాఖ వర్గాలు పేర్కొన్నాయి. ఈ వివాదం నుంచి ఇటు భారత్, అటు చైనా మర్యాదగా బయటపడాలంటే రెండు దేశాలూ డోక్లామ్ నుంచి తమ సైన్యాలను ఉపసంహరించుకోవడం ఒక్కటే మార్గమని తెలిపాయి. ఒకవేళ అందుకు ఒప్పుకోకుండా చైనా జగడానికికానీ, యుద్ధానికికానీ దిగితే.. దానిని ఎదుర్కోవడానికి భారత సైన్యం సర్వసన్నద్ధంగా ఉందని, చైనాకు చెందిన పీపుల్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్‌ఏ) ఏదైనా దుస్సాహసానికి ఒడిగడితే తిప్పికొట్టేందుకు సరిహద్దుల్లో తమ సన్నద్ధతను పెంచిందని రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి.

గత 50 రోజులుగా సిక్కిం-భూటాన్-టిబేట్ ట్రై జంక్షన్‌లోని డోక్లామ్ కొండప్రాంతంలో భారత్-చైనా సైనికుల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఇరుదేశాల సైన్యాలు కేవలం వందల మీటర్ల దూరంలో మోహరించి ఉన్న ప్రస్తుత తరుణంలో చైనా మీడియా తరచూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తోంది. డోక్లామ్ నుంచి భారత సైన్యాన్ని తరిమేసేందుకు పీఎల్‌ఏ చిన్నపాటి సైనిక ఆపరేషన్‌ను చేపట్టవచ్చునని గ్లోబల్ టైమ్స్ పత్రిక పేర్కొన్న సంగతి తెలిసిందే. చర్చలు, శాంతియుత మార్గంలోనే ఈ వివాదాన్ని పరిష్కరించుకోవాలని భావిస్తున్నట్టు ఇప్పటికే విదేశాంగమంత్రి సుష్మా స్వరాజ్ పార్లమెంటులో వెల్లడించారు.

## 'గర్విస్తున్నా.. నీది గొప్ప నిర్ణయం తల్లి'

న్యూఢిల్లీ: తనను నడిరోడ్డుపై వెంబడించి వేధించారంటూ హరియాణా బీజేపీ చీఫ్ సుభాష్ బరాల కొడుకు వికాస్ బరాలాపై ఫిర్యాదు చేయడంతోపాటు ఈ కేసు విషయంలో పోరాటం తీవ్రతరం చేసిన బాధితురాలు వర్ణికా కుందుకు ఆమె తండ్రి ఐఏఎస్ అధికారి వీరేందర్ కుందు మరింత అండగా నిలిచారు. ఆమె తీసుకున్న నిర్ణయంపట్ల హర్షం వ్యక్తం చేశారు. మన సమాజంలో పేరుకుపోయిన దురాభిమానంపై నువ్వు పోరాటం చేయాలని నిర్ణయించుకున్నందుకు గర్వంగా ఉంది. ఈ కేసు ద్వారా ఒక ఐఏఎస్ అధికారిని అయిన తనకు ఎలాంటి సమస్యలు వస్తాయోనని నువ్వు అస్సలు ఆలోచించకు. నా జీవితానికి ఈ కేసుకు ముడిపెట్టుకొని భయపడకు' అంటూ ఆమెకు ధైర్యం నూరి పోశారు.

ఎట్టి పరిస్థితుల్లో నేరస్తులను విడిచిపెట్టకూడదని, వారికి శిక్షపడాల్సిందేనని ఆయన ఫేస్‌బుక్‌లో రాసుకొచ్చారు. ప్రశాంతంగా ఉన్న జీవితాలు గందరగోళంగా మారుతాయేమోనని నేరస్తులను ఎట్టిపరిస్థితుల్లో విడిచిపెట్టకూడదని ఆయన పోస్ట్‌లో చెప్పారు. హరియాణాలో ఐఏఎస్ అధికారిగా పనిచేస్తున్న వీరేందర్ కుందు కుమార్తె ఒంటరిగా కారులో వెళుతుండగా వికాస్ బారాల అతడి స్నేహితుడు వేధించే ప్రయత్నం చేశారు. ఆమెను నడిరోడ్డుపై వెంటాడారు. చండీగఢ్‌లో శుక్రవారం రాత్రి బాధితురాలు కారులో తన ఇంటికి వెళ్తుండగా.. మద్యం మత్తులో ఉన్న వికాస్, అతని స్నేహితుడు ఆశిష్ తమ ఎస్‌యూవీ వాహనంలో తరిమారు.

కారు ఆపాలని యువతిని పదే పదే హెచ్చరించారు. దీంతో ఆమె పోలీస్ హెల్ప్ లైన్ నంబర్‌కు కాల్ చేసి విషయాన్ని తెలిపింది. పోలీసులు అక్కడికి చేరుకునేలోగా ఆమెను నిలువరించి మరీ ఆ ఇద్దరూ వేధించారు. దీంతో పోలీసులు సంఘటనాస్థలంలోనే వికాస్‌ను, ఆశిష్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం పోలీసులు ఇద్దరు నిందితుల్ని బెయిల్‌పై విడుదల చేశారు. రాజకీయ ప్రాబల్యమున్న కుటుంబానికి చెందిన నిందితులపై పోలీసులు కిడ్నాప్ అభియోగాలు నమోదుచేయకపోవడంతో హరియాణాలోని బీజేపీ సర్కారుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## తక్కువ ఖర్చుతో ఆ సర్వీసులు- గో ఎయిర్



కోల్‌కత్తా: ప్రయివేటు విమానయాన సంస్థ గో ఎయిర్ విదేశాలు వెళ్లాలనుకునే విమాన ప్రయణికులకు ఊరటనందిస్తోంది. త్వరలోనే తక్కువ ఖర్చుతో నడిచే విదేశీ విమాన సర్వీసులు ప్రారంభించనున్నామని ప్రకటించింది.

తమ విదేశీ కార్యకలాపాలను త్వరలోనే ప్రారంభిస్తామని గో ఎయిర్ మేనేజింగ్ డైరెక్టర్ హెహ్ వాడియా వెల్లడించారు. ఈ ఏడాది అక్టోబర్ నుంచి తమ విదేశీ గో ఎయిర్ విమానాలను ప్రారంభిచనున్నామని ఆయన అన్నారు.

ప్రారంభంలో ఆసియా రీజన్ తమ సేవలను ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న 24-బలమైన విమానాలకు తోడు నియో ఎ320 143 ఎయిర్ బస్‌లకు ఆర్డర్‌చేసినట్టు పేర్కొన్నారు. వీటిలో అయిదింటిని ఇప్పటికే తమకు అందాయని, ఇంజిన్ లోపాల కారణంగా డెలివరీ ఆలస్యమవుతున్నట్టు వాడియా వివరించారు.మరోవైపు ప్రభుత్వ రంగ విమాన సంస్థ ఎయిర్ ఇండియా వాటాల కొనుగోలుపై మరో వైమానిక సంస్థ ఇండిగోకు పోటీగా రానుందా అని ప్రశ్నించినపుడు అలాంటిదేమీలేదని స్పష్టం చేశారు. అలాగే సంస్థ ఐపీఓకు వచ్చే అంచనాలను కూడా ఆయన కొట్టి పారేశారు.

## రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రఫుల్ పటేల్ షాక్

న్యూఢిల్లీ : గుజరాత్ నుంచి కాంగ్రెస్ తరపున పెద్దల సభకు బరిలో నిలిచిన అహ్మద్ పటేల్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీ శిబిరంలోకి క్యూ కడుతున్న క్రమంలో తాజాగా నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేత ప్రఫుల్ పటేల్ వ్యాఖ్యలు ఆ పార్టీని మరింత కలవర పెడుతున్నాయి. జ్యసభ ఎన్నికల్లో గుజరాత్ నుంచి ఏ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలనేదానిపై తమ పార్టీ ఇంకా ఓ నిర్ణయం తీసుకోలేదని ఆయన ప్రఫుల్ పటేల్ వ్యాఖ్యానించారు. 2012 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో శరద్ పవార్ సారథ్యంలోని ఎన్‌సీపీ కాంగ్రెస్‌తో కలిసి పోటీచేసింది. గుజరాత్ శాసనసభలో ఆ పార్టీకి ఇద్దరు ఎమ్మెల్యేలున్నారు. గుజరాత్ నుంచి ముగ్గురు రాజ్యసభకు ఎంపికవనుండగా వారిలో బీజేపీ నుంచి అమిత్ షా, స్మృతీ ఇరానీలు సులభంగా ఎన్నికవనున్నారు. మూడో అభ్యర్థిగా కాంగ్రెస్ నుంచి తిరిగి బరిలో నిలిచిన అహ్మద్ పటేల్‌కు 45 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. సీనియర్ నేత వాఘేలా మద్దతుదారులు రాజీనామా చేయడంతో కాంగ్రెస్ పార్టీ వద్ద ప్రస్తుతం 44 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. ఈ నేపథ్యంలో అహ్మద్ పటేల్ గెలువాలంటే ఎన్సీపీ మద్దతు కీలకమని కాంగ్రెస్ భావిస్తోంది.

## సమయం

### "అభినవ గీతాంజలి"

'శ్రమ'కు తగిన మూల్యం లభించే రోజు
శ్రామిక జీవితాల్లో సిరికాంతులు మెరిసే రోజు
పల్లె గుండెల్లో మల్లెలు విరిసే రోజు
సంపూర్ణ గ్రామీణ వికాసం సాధించిన రోజు
నేలను నమ్మిన రైతన్నల బతుకుల్లో
ఆశల హరివిల్లులు చిగురించే రోజు
పారంపర్య వృత్తుల ప్రాభవం పెరిగే రోజు
కళలకు ఆదరణ పెరిగే రోజు
కులమత వర్గ విభేదాల్లేని సామరస్యపురోజు
సంకుచిత భావాలు పొడసూపని రోజు
ధరల దాడి లేని రోజు
అలజడులు... ఆపదలు దరి చేరని రోజు
అంటరాని కంటపడని వ్యాధులు సోకని రోజు
అందరికీ ఆరోగ్యం అందే రోజు
ప్రశాంత చిత్తంతో మనగలిగే రోజు
ఓ పరమాత్మా! మానవాళికి అనుగ్రహించు!

...కె.వి.ఎస్. నరసింహం

## పంచాంగం

మాసం : శ్రావణ ; తిథి : బ. పాడ్యమి రా.11.41; ధనిష్ఠ తె.5.14; ఉ.వ.8.11ల 9.52.

మంగళవారం 08-08-2017

**మేషం :** వాహనం నడుపుతున్నపుడు ఏకాగ్రత అవసరం. ఉద్యోగ భద్రత వల్ల భవిష్యత్ పట్ల భరోసా వస్తుంది.తరచూ దైవ కార్యాల్లో పాల్గొంటారు. ఆత్మ విశ్వాసంతో సవాళ్ళను ఎదుర్కొంటారు. రాబోయే ఆదాయానికి తగినట్టుగా ప్రణాళికలు రూపొందించుకుంటారు. పెద్దలను అనా రోగ్య సమస్యలు బాధిస్తాయి. వృత్తి వ్యాపారాల కోసం ధనం అధికంగా వెచ్చిస్తారు. **వృషభం** :బ్యాంకు వ్యవహారాలలో అపరిచిత వ్యక్తుల పట్ల అవసరం. బంధువుల విషయంలో తలదూర్చడం కంటే మీ పనులు మీరు చేసుకోవడం మంచిది. మీ సంతానం మీ మాటను గౌరవిస్తారు. మీ సంతానంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడుపుతారు. స్త్రీలకు ప్రకటనలు, స్కీముల పట్ల అవగాహన అవసరం. **మిథునం** : పాత మిత్రుల కలయికతో గత అనుభవాలు జ్ఞప్తికి వస్తాయి. దీర్ఘకాలంగా కోర్టులో ఉన్న కేసు ఒకటి మీకు ఊరటనిస్తుంది. స్త్రీలు గృహోపకరణాలు కొనుట పట్ల ఆసక్తి చూపుతారు. రాబడికి తగినట్లుగా ఖర్చులు ఉంటాయి. దైవ కార్యాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. **కర్కాటకం** : వృత్తుల వారు ఆర్థికంగా నిలదొక్కుకుంటారు. సాహస ప్రయత్నాలు విరమించండి. పలుకు బడి ఉన్న వ్యక్తులతో పరిచయాలేర్పడతాయి. కుటుంబీకుల కోసం ధన బాగా వ్యయం చేస్తారు. ఉద్యోగస్తులు సమర్థంగా పనిచేసి పై అధికారులను మెప్పిస్తారు. ఒక కార్యం నిమిత్తం ఆకస్మికంగా ప్రయాణం చేస్తారు. **సింహం** : పత్రిక, ప్రింటింగ్ రంగాల వారికి ఓర్పు, అంకితభావంతో శ్రమించాల్సి ఉంటుంది. స్త్రీలకు పనివారతో ఇబ్బందులు తలెత్తుతాయి. మీరు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న మిత్రులను కలుసుకుంటారు. చేతివృత్తుల వారికి సదావకాశాలు లభిస్తాయి. విద్యార్థుల ప్రేమ వ్యవహా రాలకు దూరంగా ఉండటం మంచింది. **కన్య** : ఇంటా బయట అధిక కృషి అనంతరం మంచి ఫలితాలను పొందుతారు. కొబ్బరి, పండ్ల, పూల, చిరు వ్యాపారులకు కలిసిరాగలదు. హామీలు, మధ్య వర్తిత్వా లకు దూరంగా ఉండటం మంచిది. స్త్రీలకు ఆర్జనపట్ల ఆసక్తి, అందుకు అనువైన పరి స్థితులు నెలకొంటాయి. నిరుద్యోగులు వచ్చిన అవకాశాలను చేజార్చు కుంటారు. **తుల** : నూతన టెండర్ల విషయమై ప్రముఖులతో సంప్ర దింపులు జరుపు తారు. స్త్రీలకు ఆరోగ్యకరమైన సంప్రదింపులు జరుపుతారు. సభలు, సమావేశాలలో కొత్త పరిచయాలు ఏర్పడతాయి. అనుకోని ఖర్చులు, ఇతరాత్రా సమస్యల వల్ల మానసిక ప్రశాంతత లోపిస్తుంది. **వృశ్చికం** : బంధువుల రాకపోకలు అధికమవుతాయి. నూతన పెట్టుబడులు, వ్యాపారాల విషయంలో పునరాలోచన అవసరం. రుణాలు తీరుస్తారు. మీ సంతానం వివాహం, విద్య విషయాల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనుపరుస్తారు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. పోస్టల్, ఎల్.ఐ.సి ఏజెంట్లకు ఆర్థికంగా బాగుంటుంది. **ధనుస్సు** : ధన వ్యయంలో ఏకాగ్రత వహించండి. ఉద్యోగస్తులకు పనిభారం, విశ్రాంతి లోపం వంటి చికాకులు అధికంగా ఉంటాయి. దైవ, సేవా కార్యక్రమాలకు సహాయ సహ కారాలు అందిస్తాయి. వస్త్ర, బంగారు, ఫ్యాన్సీ, పచారీ వ్యాపారులకు సంతృప్తి, పురోభివృద్ధి. **మకరం** : గృహ మార్పులు, మరమ్మతులు అనుకూలిస్తాయి. స్త్రీల, ఆలోచనలు, అభిప్రాయాలకు మంచి స్పందన లభిస్తుంది. హోటల్, తిను బండరాలు, చిరు వ్యాపారులకు అశాజనకం. ప్రింటింగ్ రంగాల వారికి ఒత్తిడి బాగా ఉంటుంది. ప్రతి పనిలోనూ ఎదుటివారి నుంచి విమర్శలు రాకుండా జాగ్రత్త తీసుకోవలసి ఉంటుంది. **కుంభం** : మీ యత్నాలకు కుటుంబీకుల సహకారం అందుతుంది. ఆస్తి పంపకాలు, భూ వివాదాలు ఒక కొలిక్కి వస్తాయి, వాహనం విలువైన వస్తువులు ఇతరులకిచ్చే విషయంలో లౌక్యంగా మెలగండి. విద్యార్థులు క్రీడలు, క్విజ్ పోటీల్లో రాణిస్తారు. గృహ నిర్మాణాలలో స్వల్ప అడ్డంకులు, చికాకులు ఎదుర్కొంటారు. **మీనం** :సత్కాలం ఆసన్నమైంది, అనుకున్న పనులు ఆశించినంత చురుకుగా సాగవు. ఉద్యోగస్తులు యూనియన్ కార్య కలాపాల్లో తలమునకలై ఉంటారు.

# హనుమాన్ చాలీసా యొక్క ప్రాముఖ్యత




హనుమాన్ చాలీసా అంటే ఆత్మలకు భయం అని మరియు హనుమంతుడు అంటేనే ర్యానికి మారుపేరు అని తెలియచెప్పిన ఈ చాలీసా అత్యంత ప్రసిద్ధి చెందింది. అత్యంత శక్తివంతమైనది అని పిలువబడుతున్న ఈ హనుమాన్ చాలీసాను శ్రీరామచంద్ర భక్తుడు గొప్ప నైష్ఠిక భక్తుడు, తులసీదాస్ రచించారు. తులసీదాస్, రచించిన రచనలలో అత్యంత ఉత్తమమైనది, ముఖ్యమైనది తులసీ రామా యణము. హనుమాన్ చాలీసా ప్రాము ఖ్యత ఏమిటి అనే ప్రశ్నకు వస్తే, చాలీసాలోని శ్లోకాలకు అర్థమేమిటి, దీనియొక్క శక్తివంత మైన మహిమ ఏమిటి అనే విషయాన్ని మనం తెలుసు కుందాము. ఈ వ్యాసం హనుమాన్ చాలీసా యొక్క ప్రాముఖ్యత గురించి తెలియ చెపుతుంది. దాదాపు హనుమాన్ చాలీసాలోని ప్రతి పదం అనేక రకాల ప్రయోజనాలతో ముడిపడి ఉంది. వివిధ శ్లోకాలను దోహాలుగా కూడా పిలుస్తారు. చాలీసాలోని కొన్ని ముఖ్యమె%న శ్లోకాలను మరియు హనుమాన్ చాలీసా చదవటంవలన కలిగే మొత్తం ప్రయోజనాలను మనం ఇక్కడ పరిశీలిద్దాం.

హనుమాన్ చాలీసాలోని ప్రారంభ దోహా జయ హనుమాన్ జ్ఞాన గుణ సాగర వల్లే వెయటం వలన జీవితంలో స్వాభావిక దివ్య జ్ఞానాన్ని పొందుతారు. ఈ జ్ఞాన సహాయంతో, జీవితంలో ప్రతిష్టంభించిన అనేక సవాళ్లు, దాదాపు అసాధ్యం అనుకున్న వాటిని సాధించగలుగుతారు. మహావీర్ విక్రమార్కుడుతో మొదలయ్యే 'మూడవ దోహా' ప్రజలలో బలాన్ని నింపుతుంది మరియు అవాంఛనీయమైన సహవాస ప్రభావాలనుండి బయట పడడానికి సహాయ పడుతుంది. చాలీసాలోని ఏడవ మరియు ఎనిమిదవ శ్లోకాలు, శ్రీరాముడి ఆత్మతత్వాన్ని అర్థం తెలియచేస్తాయి మరియు దేవుని దివ్యసన్నిధికి చేరువ చేస్తాయి. 14వ మరియు 15వ దోహాలు ఒక వ్యక్తి కీర్తిప్రతిష్టలు పొందటానికి సహాయం చేస్తాయి. మీ పనులు నిర్వహించడానికి కావలసిన సామర్థ్యం మరియు మీ సామ ర్థ్యం పట్ల అందరి ప్రశం సలు అందు కుంటారు. 11వ ఛౌపయి చదవటం వలన పాములు మరియు విష జంతువుల భయం తొలగించ డానికి సహాయం లభిస్తుంది. 16వ మరియు 17 ఛౌపయిస్ చదటం వలన జీవితంలో కోరుకున్న స్థానానికి ఎదగటానికి సహాయ పడుతుంది. అది ఒక కార్యాలయంలో వద్ద ప్రమోషన్లు కావొచ్చు లేదా ఉద్యోగానికి సంబంధించినది అయి ఉండవొచ్చు. 20వ దోహా చదవటం వలన జీవితంలో అనేక సవాళ్లను అధిగమించవొచ్చు మరియు అనేక అడ్డంకులు తొలగిపోయి లక్ష్యాలను సాధించడంలో సహాయపడుతుంది. 24వ ఛౌపయి, ముఖ్యమైనది, ఢాకిణి పిశాచాలు, భూతాలు మరియు చేతబడి ప్రభావాలు పడకుండా ఉండటానికి సహాయ పడుతుంది.

చాలీసాలోని ప్రతి దోహాతో ముడిపడి జీవులకు అనేక లాభాలు ఉన్నాయి. అందువలన హనుమాన్ చాలీసాకు గొప్ప ప్రాముఖ్యత ఉన్నది.

## సంకీర్తన



రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు

## చుండూరు మృతులకు నివాళి

చుండూరు : చుండూరు కేసులో న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి మేళం భాగ్యారావు తెలిపారు. చుండూరు బాధితుల పోరాట సమితి ఆధ్వర్యంలో రక్తక్షేత్రం వద్ద మృతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి ఎ.మాల్యాద్రి మాట్లాడుతూ దళితు లంతా ఏకంగా ఉండి వారిపై జరుగుతున్న దాడులను నియంత్రించాలన్నారు. చుండూరు మారణకాండ జరిగి 25 సంవత్సరాలు దాటినా ఇంతవరకు దోషులకు శిక్ష పడలేదంటే మనం ఎలాంటి ప్రజాస్వామ్య వ్యస్థలో ఉన్నామో అర్థం చేసుకోవాలన్నారు. చుండూరు బాధితుల పోరాటసమితి అధ్యక్షులు జాలాది మోజెస్ మాట్లాడుతూ చుండూరు వూచకోత మృతుల సమాధుల వద్ద స్తూపం ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ముందుగా బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి, చుండూరు గొడవల్లో జరిగిన పోలీస్ కాల్పుల్లో మృతిచెందిన కొమ్మెర్ల అనీల్‌కుమార్ స్తూపానికి పూలమాలలు వేశారు. ప్రధాన వీధిలో ప్రదర్శన నిర్వహిస్తూ, రక్తక్షేత్రం వద్దకు చేరుకుని, బాధిత కుటుంబాలతో కలసి, మృతుల సమాధులపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కెవీపీఎస్ జిల్లా కార్యదర్శి టి.కృష్ణమోహన్, దళిత నాయకులు డి.ప్రభాకర్, దేవరపల్లి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి సీనియర్ బ్యాడ్మింటన్ ఎంపికలు



కడప : జిల్లాలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో గురువారం నుంచి జిల్లా స్థాయి సీనియర్ బ్యాడ్మింటన్ ఎంపికలు నిర్వహిస్తున్నారు. ఇందులో జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 21 నుంచి 24 వరకు పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అడ్‌హక్ కమిటీ ఛైర్మన్ తోటకృష్ణ మాట్లాడుతూ.. గెలుపోటములకు అతీతంగా క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలన్నారు. అలాగే జిల్లాలో బ్యాడ్మింటన్ క్రీడ దినదినాభివృద్ధి చెందుతోందని, దీని అభివృద్ధికి తోడ్పడుతున్న జిల్లా సంఘం సేవలు ప్రశంసనీయమన్నారు. భవిష్యత్తులో జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు తనవంతు సహకారం అందిస్తామన్నారు. డీఎస్‌డీవో ఉమాశంకర్ మాట్లాడుతూ.. బ్యాడ్మింటన్ క్రీడాకారులకు కావాల్సిన అన్ని వసతులు మన దగ్గర ఉన్నాయని, సద్వినియోగం చేసుకొని, క్రీడా భవిష్యత్తుకు రాజబాట వేసుకోవాలని కోరారు. ప్రాంతీయ క్రీడల కో-ఆర్డినేటర్ మురళి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా జిల్లాలో బ్యాడ్మింటన్ క్రీడ గణనీయమైన అభివృద్ధి సాధించిందన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన బ్యాడ్మింటన్ క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా సత్తా చాటాలని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి జిలాని బాషా కోరారు. కార్యక్రమంలో కోశాధికారి నాగరాజు, సంయుక్త కార్యదర్శి రాంమనోహర్‌రెడ్డి, బ్యాడ్మింటన్ కోచ్‌లు సుదర్శన్, శ్యామ్యూల్ సోని తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఓటరు ఓటేసేలా సిబ్బంది సహకరించాలి

నంద్యాల : ఓటరు గుర్తింపు కార్డు లేదా రిటర్నింగ్ అధికారి జారీ చేసిన చీటీ ఉన్న ప్రతి ఓటరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ఎన్నికల సిబ్బంది సహకరించాలని ఎన్నికల పరిశీలకుడు హిమాంగ్షు జ్యోతి చౌదరి పేర్కొన్నారు. నంద్యాల పురపాలక కార్యాలయంలో ఎన్నికల సిబ్బందితో జరిగిన సమావేశంలో రిటర్నింగ్ అధికారి ప్రసన్న వెంకటేశ్‌తో కలసి ఆయన పాల్గొని విధుల నిర్వహణపై ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ బూత్ సిబ్బంది పూర్తి సహకారాన్ని అందించాలని, బూత్‌లెవల్ అధికారులు ఇచ్చిన చీటీలను పరిశీలించి ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సెక్టార్ అధికారులు, పోలీసు సిబ్బంది పరస్పరం సమన్వయంతో పని చేస్తే ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతాయన్నారు. ఖర్చు వివరాలను ఎప్పటికప్పుడు తెలిపేలా, నమోదు చేసేలా, వీడియో చిత్రీకరణ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల అధికారి అనుమతితోనే ఫ్లెక్సీలు, బ్యానర్లు, ఇతత్రా ప్రచార సామగ్రి ప్రదర్శించాలన్నారు. ప్రతి అభ్యర్థి రూ.28 లక్షల వ్యయం చేయొచ్చునన్నారు.

# జగన్నాథ బలదేవులకు మహా కుంభాభిషేకం

రాజమహేంద్రవరం : శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు రాజమహేంద్రవరం గౌతమి ఘాట్‌లోని ఇస్కాన్ మందిరంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం 7:30 గంటలకు శృంగార హారతితో ప్రారంభమైన కార్యక్రమంలో భాగవత ప్రవచనం, అఖండ హరినామ సంకీర్తన జరిగాయి. బలరామ జయంతి సందర్భంగా జగన్నాథ, బలదేవ, సుభద్రదేవిలకు ఇస్కాన్ అధ్యక్షుడు గోపీనాథ్‌దాస్ పర్యావేక్షణలో మహాకుంభాభిషేకం నిర్వహించారు. రాధకృష్ణులకు ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ ఉత్సవాలకు భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈ ఉత్సవాలు ఈ నెల 15 వరకు జరగనున్నాయి.

# ఘనంగా శతకుండాత్మక మహాలక్ష్మి యాగం

పటమట : దత్తపీఠంలో శతకుండాత్మక మహాలక్ష్మి యాగం వైభవంగా నిర్వహించారు. సుమారు 70 హోమ కుండాలతో దంపతులు కూర్చొని ఈ క్రతువు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు యాగం నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి వేద రుత్విక్కులు సుదర్శనయాగం కొనసాగించారు. దేశంలోని ఆర్థిక ఇబ్బందులు, ఆర్థిక ఒడిదుడుకులు తొలగి ప్రజలు సుఖశాంతులతో వర్థిల్లాలని ఆకాంక్షిస్తూ ఈ ఈ యాగం రాష్ట్రంలో 10 చోట్ల నిర్వహిస్తున్నట్లు యాగ నిర్వాహకులు ఆగమద్యుమణి బ్రహ్మశ్రీ యనమండ్ర వేణుగోపాలశాస్త్రి తెలిపారు. ఏడో యాగాన్ని దత్తపీఠంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. సాయంత్రం 7 గంటలకు మహాపూర్ణాహుతి చేశారు.

# పోలీసు అధికారులకు రాఖీలు కట్టిన బ్రహ్మకుమారీలు

కడప : కడప చిన్నచౌకులోని రామ్‌నగర్ ఓంశాంతి బ్రహ్మకుమారి బీకే.సుశీల అక్కయ్య ఆధ్వర్యంలో జిల్లా పోలీసు అధికారులకు ముందస్తు రాఖీ కట్టారు. జిల్లా పోలీసు అధికారి బాబూజీ, ఏఆర్ డీఎస్పీ మురళీధర్‌లకు వారి కార్యాలయాలకు వెళ్లి రాఖీలు కట్టారు. వారికి మిఠాయిలు తినిపించారు. రాఖీ పండగ గురించి పోలీసులకు తెలియచేశారు. అందరు సోదరభావంతో మెలగాలని కోరారు. కార్యక్రమంలో పలువురు అక్కయ్యలున్నారు.

# చేపపిల్లల పెంపకంతో అదనపు ఆదాయం

## నీటికుంటలు ఉన్న రైతులకు ఉచితంగా చేపపిల్లలు

చిత్తూరు : అందుబాటులో ఉన్న వనరులు, తక్కువ పెట్టుబడులతో చేపపిల్లల పెంపకాన్ని చేపట్టవచ్చు. వ్యవసాయ పంటల సాగుతో పాటు చేపపిల్లల పెంపకంతో రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందని జిల్లా మత్స్యశాఖ ఉపసంచాలకుడు నాగేశ్వరరావు తెలిపారు. జిల్లా పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న ఆదేశాల మేరకు జిల్లాలో మత్స్య సంపద అభివృద్ధి, తక్కువ ఖర్చుతో రైతులకు అదనపు రాబడికి ప్రత్యామ్నాయ మార్గాలకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. జిల్లాలో ఉద్యాన పంటలు విస్తారంగా సాగవుతున్నాయి.ఉద్యాన శాఖ, నీటి యజమాన్య సంస్థ ద్వారా 20స20 మీటర్ల విస్తీర్ణంలో నీటి కుంటల(ఫారం పాండ్)ను రైతులు ఏర్పాటు చేసుకున్నారు. తక్కువ నీటి వనరులు ఉన్న రైతులు నీటికుంటలో నీటిని నిల్వ చేసుకుని సాగుకు ఉపయోగిస్తున్నారు. నీటికుంటలో చేపపిల్లల పెంపకానికి చర్యలు చేపట్టామన్నారు. ఈ నేపథ్యంలో నీటి కుంటలు కలిగిన రైతులకు ఉచితంగా చేపపిల్లలు పంపిణీ చేస్తామన్నారు. చేపపిల్లల పెంపకంతో 5-6 నెలల వ్యవధిలో రైతుకు సుమారు రూ.15-20వేలు అదనపు ఆదాయం లభిస్తుందని చెప్పారు. చేపపిల్లల ఎదుగుదలకు ఆహారంగా అందించే మాంసపు కృతులు, దాణాను రైతులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. చేపపిల్లలు కావలసిన రైతులు ఆయా ప్రాంతాల్లోని మత్స్యశాఖ అభివృద్ధి అధికారిని సంప్రదించాలని ఆయన కోరారు.

# సేవాసంస్థల ద్వారా గిరిజనులకు వైద్యం

శ్రీశైలం: రాష్ట్రంలోని గిరిజనులకు రామకృష్ణా, చిన్మయ పరమహంస, ఆర్డీటీ తదితర సేవ సంస్థల ద్వారా మెరుగైన వైద్యసేవలు అందించనున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య తెలిపారు. ఈ సంస్థల ప్రతినిధులతో శ్రీశైలం ఐటీడీఏ ప్రాంగణంలో పూనం మాలకొండయ్య, సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు.

# భారతీయ కళకు ప్రపంచ నీరాజనం

## ముగిసిన జాతీయస్థాయి నృత్యోత్సవాలు





తిరుపతి : సంస్కృతిని పరిచయం చేస్తూ.. మానవీయతను తెలియజెపుతూ కళ మానవాళికి దిక్సూచిగా విరాజిల్లుతోందని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక మహతి కళాక్షేత్రంలో రంగస్థల సకలవృత్తి కళాకారుల సంక్షేమ సంఘం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా రెండురోజుల పాటు జరిగిన జాతీయస్థాయి నృత్యోత్సవాలు ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ముక్తేశ్వరరావు మాట్లాడుతూ భారతీయ కళకు ప్రపంచం మొత్తం నీరాజనం పలుకుతోందని చెప్పారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన డాక్టర్ రాళ్లపల్లి సుధారాణి మాట్లాడుతూ కళలను, కళాకారులను ప్రోత్సహించడానికి జాతీయస్థాయి నృత్యోత్సవాలు దోహదపడతాయన్నారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు సురభి ఆనంద్ మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో కళాకారుల సంక్షేమానికి కృషిచేస్తూనే.. వారిని ప్రోత్సహించాలన్న లక్ష్యంతో జాతీయస్థాయి నృత్యోత్సవాలు నిర్వహించినట్లు చెప్పారు. వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన కళాకారులు అద్భుత ప్రదర్శనలిచ్చారని కొనియాడారు.

కార్యక్రమంలో భాగంగా ప్రముఖ భరతనాట్య కళాకారులు డాక్టర్ దేవేంద్రపిళ్లై, కూచిపూడి నృత్యకారులు తాళ్లపాక సందీప్‌కు ఘనసత్కారం చేశారు. ప్రముఖ సీనియర్ మేకప్ ఆర్టిస్టు హరిప్రసాద్‌కు బెస్ట్ మేకప్ ఆర్టిస్టు అవార్డును అందజేశారు. ఎం.ఉమాముద్దుబాలకు నందీశ్వర నాట్య కళా అవార్డును ప్రదానం చేశారు. ఎం.కిషోర్‌బాబుకు ఉత్తమ రంగస్థల నటుడు అవార్డును అందజేశారు. సంగీత కళాశాల ప్రిన్సిపల్ వైపీఎస్ పద్మావతి, ఉపాధ్యక్షులు శరత్‌చంద్ర, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

## ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌కుమార్ కైత్

పొనుగుపాడు : ప్రస్తుతం నాటిన మొక్కలు భవిష్యత్తరానికి మేలు చేస్తాయని.. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌కుమార్ కైత్ అన్నారు. వనం-మనం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఫిరంగిపురం మండలం పొనుగుపాడులోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. హైకోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాది(ఏజీపీ) తూము వేణు గోపాల్ పర్యవేక్షణలో ముందుగా సురేష్‌కుమార్ కైత్‌ను గ్రామస్థులు, పాఠశాల విద్యార్థులు స్వాగతించారు. ప్రతి గ్రామంలో మొక్కల ఎదుగుదలకు గ్రామస్థులు దోహదపడాలన్నారు. ఈ సందర్భంగా పొనుగుపాడు నుంచి గుంటూరు - కర్నూలు రాష్ట్ర రహదారి వైపు వెళ్లే రహదారికి రెండు వైపులా, పొనుగుపాడు నుంచి మేరకపూడి వైపు వెళ్లే డొంక రోడ్డు, నార్నెపాడు గ్రామానికి వెళ్లే మట్టి రహదారులకు రెండు వైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా స్థాయిలో వివిధ న్యాయస్థానాలకు చెందిన ప్రధాన న్యాయమూర్తులు, సంయుక్త కలెక్టర్-2 ముంగా వెంకటేశ్వరరావు, సామాజిక అటవీ విభాగం డీఎఫ్ఓ ఎల్. భీమయ్య, ఆర్డీవో శ్రీనివాసరావు, తాహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో శ్యామలాదేవి, సర్పంచి వి.మాధవరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# స్నేహానికే మాయని మచ్చ

## స్నేహితుడి హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

తిరుపతి : నిరుద్యోగులను మోసగించి వసూలు చేసిన నగదును తిరిగి వారికి ఇమ్మని కోరిన స్నేహితుడ్ని దారుణంగా హత్యచేసి.. స్నేహానికి ఉన్న విలువను మసకబారేలా చేసిన సంఘటనలో ముగ్గురు నిందితులను ఈస్ట్ సీఐ రామ్‌కిషోర్, ఎస్ఐ ఈశ్వరయ్య బృందం అరెస్ట్ చేసినట్లు ఈస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ ఎం.మునిరామయ్య తెలిపారు. ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. పుత్తూరులోని ఆర్‌డీఎం థియేటర్ సమీపంలో నివాసం ఉంటున్న సుబ్రహ్మణ్యం, భారతిల కుమారుడు దిలీప్(26), పులిచర్ల మండలం కమ్మపల్లి గ్రామానికి చెందిన లక్ష్మిపతినాయుడు కుమారుడు అరుణ్ స్నేహితులు. గత నెల 19వ తేదీన దిలీప్ కనిపించకుండా పోగా తల్లిదండ్రులు ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుమేరకు కేసును నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా కనిపించకుండా పోయిన దిలీప్‌ను అతని స్నేహితుడు అరుణ్‌తో పాటు నగరానికి చెందిన భార్గర్, ప్రవీణ్‌లు తమతో తీసుకువెళ్లినట్లు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా గుర్తించారు. అరుణ్ స్నేహితులతో కలిసి తన కారులో వెంకటగిరి సమీపంలోని రాపూరు వద్దకు దిలీప్‌ను తీసుకెళ్లి కత్తితో బెదిరించి చేతులకు, కాళ్లకు, ముఖానికి పూర్తిగా టేపువేసి వూపిరాడకుండా చేసి దారుణంగా హత్యచేశారు. అనంతరం మృతదేహాన్ని తమిళనాడు రాష్ట్రం అరక్కోణం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాదిమంగళం గ్రామం పక్కన పడేశారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతిగా కేసును నమోదు చేశారు.

అనంతరం సమాచారాన్ని ఈస్ట్ పోలీసులకు అందించడంతో మృతుని తల్లిదండ్రులు తమ కుమారుడేనని గుర్తించారు. అప్పటికే దిలీప్ మృతిచెంది ఇరవై రోజులు కావడంతో మృతదేహాన్ని అక్కడి పోలీసులు ఖననం చేసి పదిరోజులైంది. తల్లిదండ్రులకు కనీసం అతని ఆఖరు చూపును చూసే అవకాశం లేకుండా పోయింది. కేవలం నిరుద్యోగులను మోసగించి వసూలు చేసిన నగదును తిరిగి వారికి ఇమ్మని కోరినందుకే దిలీప్‌ను అరుణ్ అతని స్నేహితులు దారుణంగా హత్యచేసినట్లు డీఎస్పీ వెల్లడించారు.

# జీవితంలో మక్కా దర్శించుకోవాలి

## ఎమ్మెల్యే యరపతినేని సేవాభావం ప్రశంసనీయం



**తెదేపా రాష్ట్ర క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ షేక్ అహ్మద్ షరీఫ్**

పిడుగురాళ్ల : ముస్లింలకు అత్యంత ప్రీతిపాత్రమైన అంశం హజ్‌యాత్ర. జీవితంలో ఒక్కసారి మక్కాను దర్శించుకోవాలన్న కోరిక ఉంటుందని తెదేపా రాష్ట్ర క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ షేక్ అహ్మద్ షరీఫ్ చెప్పారు. పిడుగురాళ్లలోని మార్కెట్ యార్డు అవరణలో హజ్ యాత్రికులకు సత్కారసభ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ ఎవరైతే హజ్‌యాత్రకు వెళతారో వారిని గౌరవిస్తారని, వారిని చూడటం కూడా పుణ్యమే అన్నారు.ఈ ఏడాది రాష్ట్రం నుంచి 2800 మంది ముస్లింలు వెళుతున్నట్లు చెప్పారు. వీరిలో 20 మందికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఒక్కొక్కరికి రూ.లక్ష సాయం చేస్తున్నారని చెప్పారు. హజ్ కమిటీ ఛైర్మన్ మొమిన్ అహ్మద్ ఉస్సేన్ మాట్లాడుతూ ముస్లింల మనోభావాలను గౌరవించి ఎమ్మెల్యే యరపతినేని మూడేళ్ల నుంచి ఆర్థిక సాయం చేయటం గొప్ప విషయమన్నారు. అన్ని మతాల ప్రజల మనోభావాలను గౌరవిస్తూ వారికి ఆయన సాయం చేస్తున్నట్లు చెప్పారు. మొదటిసారిగా ఎన్టీఆర్ మైనార్టీ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే దాన్ని అంచెలంచెలుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి చేస్తున్నారన్నారు. ముస్లింల మనోభావాలను గౌరవించేది చంద్రబాబే అన్నారు. కడప, విజయవాడ, కర్నూలులో హజ్‌హౌస్ ఏర్పాటు చేస్తారన్నారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల కోసం రూ.840 కోట్లు నిధులు కేటాయించారన్నారు. కేంద్రంలో భాజపాతో పొత్తు ఉన్న రాష్ట్రంలో ముస్లింల మీద కూడా ఈగ వాలనీయమన్నారు.

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదలకు చేతనైనంతా సాయం చేయటమే నా మతం, నా అభిమతమని చెప్పారు. పల్నాడు ప్రాంతం చాలా వెనుకబడి ఉంది.. పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్నా.. ముస్లింలు కోసం పిడుగురాళ్ల, గురజాల, పిన్నెల్లి, మాచవరంలో షాదీఖానాలు నిర్మాణ చేయించా.. దాచేపల్లిలో రూ.2 కోట్లతో షాదీఖానా నిర్మాణం చేయిస్తామని చెప్పారు. దాచేపల్లిలో ముస్లిం శ్మశానవాటికకు 3 ఎకరాలు కేటాయించాలని ఆర్డీవోకు చెప్పానని, పిడుగురాళ్లలోని ముస్లింలు నవాజ్ చేసుకోవటానికి చెరువులో మూడు ఎకరాలు భూమిని కేటాయించినట్లు చెప్పారు. పట్టణానికి 5736 ఇళ్ల నిర్మాణాలు మంజూరైతే ముస్లింలకు వెయ్యి కేటాయించినట్లు తెలిపారు. విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ మాట్లాడుతూ దేశంలో ఏ ఎమ్మెల్యే కూడా హజ్‌యాత్ర వెళ్లే వారికి ఆర్థిక సహాయం చేయలేదని, వై.ఎస్.రాజశేఖరరెడ్డి రాజకీయలబ్ధికి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు ఇచ్చారని విమర్శించారు. 4 శాతం రిజర్వేషన్‌పై కోర్టు కొట్టివేస్తే మళ్లీ చంద్రబాబు నాయుడు మంచి న్యాయవాదులను ఏర్పాటు చేసి రిజర్వేషను వచ్చేలా కృషి చేస్తున్నారన్నారు. ఈ విషయంపై వై.ఎస్. జగన్ పట్టించు కోలేదన్నారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ షేక్ జానీమూన్ మాట్లాడుతూ మూడేళ్ల నుంచి అనేక సమావేశాల్లో పాల్గొంటున్నా.. ఇలాంటి సమావేశాన్ని చూడలేదన్నారు. హజ్‌యాత్ర వెళ్లే వారికి సహాయం చేయటం ఎమ్మెల్యే యరపతినేని గొప్పతనం అన్నారు. అనంతరం యాత్రకు వెళ్లే వారిని దుశ్శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ హిదాయత్, లాల్ వజీర్, షేక్ బాబావలి, సయ్యద్ అమీర్‌అలీ, భవనాసి యల్లారావు, మార్కెట్ యార్డు ఛైర్మన్ మునగా నిమ్మయ్య, మాజీ ఛైర్మన్ వేముల వినోద్‌రెడ్డి, పురపాలక సంఘం ఉపాధ్యక్షుడు అద్దంకి రత్నాకరరావు, జీడీసీసీ బ్యాంకు డైరెక్టరు వడ్డవల్లి సర్వేశ్వరరావు, గుంటుపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# యువతే జాతి వికాసానికి పునాది

## జిల్లా ప్రధా న్యాయమూర్తి శ్రీనివాస్

కడప : జాతి వికాసం చెందాలంటే యువత చైతన్యం కావాలి. కుటుంబ ప్రగతి, దేశప్రగతి యువత భవిష్యత్తు మీదనే ఆధారపడి ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ అన్నారు. స్థానిక మరియాపురంలోని ఎంపీపీఎస్ ప్రాంగణంలో నిర్వహించిన ఆదివార యువజనోత్సవాల సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మొదట తమ జీవితాల్ని అధ్యయనం చేసుకోవాలన్నారు. నిత్యోత్సాహాన్ని పొందాలంటే ఆనందంగా ఉండాలన్నారు. అప్పుడే మనలోని మేధస్సు, ప్రతిభ ఉన్నత స్థితికి చేరుకుంటాయన్నారు. మానసిక యోగా మనను ప్రతిభావంతులను చేస్తుందని యువతకు సందేశం ఇచ్చారు. తల్లి త్యాగాన్ని, తండ్రి ప్రోత్సాహాన్ని మరువకూడదన్నారు. హేతుబద్ధమైన జీవనానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. యువత తెలియని స్థితిలో నేరాల వూబిలో చిక్కుకుంటున్నారని అనేక ఉదాహరణలతో విశదపరిచారు. తప్పుచేస్తే దిద్దుకోలేని స్థితి ఉంటుంది కనుక వాటి జోలికి వెళ్లకుండా ఉండాలన్నారు. వ్యక్తిగత ప్రయోజనం ఏ స్థాయిలో ఆశిస్తామో సమాజ ప్రగతిపై అంతే బాధ్యతగా ఉండాల్సిన అవశ్యకతను ఆయన వివరించారు. దేవుడు మనలకు ఉన్నతమైన మానవ జన్మ ఇస్తూ మనకు తెలియకుండా ఏన్నో వరాలను ఇచ్చాడని గుర్తు చేశారు. ఉపయోగించుకునే కొలదీ వికసించే మేధస్సు, గుండె వంటి ఎన్నో విజయవంతమైన శక్తులను మనకు దేవుడు అందించాడు. కోటాను కోట్ల కణాలతో పోరాడి జన్మతోనే గొప్ప విజయాన్ని సాధించిన మనం అద్భుత శక్తులుగా ఎదగడం అనేది మన నిరంతర శ్రమపై ఆధారపడి ఉందన్నారు. చిన్ననాటి నుంచి అనేక వైఫల్యాలను చవిచూస్తూ విజయం కోసం అవిశ్రాంత శ్రమ చేసినందు వల్లనే నేను ఈ స్థాయికి రాగలిగానని ఆయన విద్యార్థులకు తన జీవితంలో పడ్డ కష్టాలు, తాను శ్రమించిన విధానం గుర్తు చేశారు. సామాజిక ప్రగతికి కృషి చేయాలని యువతకు సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా మొదటి కెథిడ్రిల్ చర్చిలో బిషప్ గల్లెల ప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాగిన సభలో న్యాయమూర్తి శ్రీనివాస్, విచారణ గురువులు ఫాదర్ సగిలి ప్రకాష్ జ్యోతి ఉద్దీపనం గావించారు. కార్యక్రమంలో పలువురు యువతీ యువకులు, ప్రభుత్వ న్యాయవాది గురప్ప పలువురు విచారణ గురువులు, కన్యస్త్రీలు పాల్గొన్నారు.

# మచ్చల నివారణకు



ప్రపంచంలో ప్రతి ఒక్క మహిళ కూడా హీరోయిన్ లాగా ఉండాలనే అనుకుంటుంది. కానీ ఎక్కడా? ఆ అందం అందరికి రాదు కదా. అలా అందంగా కనపడాలని మొహంపై ఎక్కువగా క్రీమ్స్ రాయడం వలన మొదట్లో బాగున్నా, పోను పోను మొహంపై అక్కడక్కడ నల్లని మచ్చలు ఏర్పడుతుంటాయి. ఈ మచ్చలను గిచ్చేసి, గోకేసి మొహాన్ని మరింత చెత్తగా చేసుకోకుండా, వంటింట్లోనే ఉండే వస్తువులతో మచ్చలను తొలగించేసి, మొహాన్ని కాంతివంతంగా చేసుకోవడంలో కొన్ని పద్ధతులు... అలోవేరా(కలబంద)ను వాడటం వలన మీ చర్మంపై ఉం డే మొటిమలు మచ్చలు పోయి, మొహం కాంతివంతంగా కనిపిస్తుంది. వెల్లుల్లిలో ఎక్కువ ఘాటుదనంతో పాటు, సల్ఫర్ కూడా ఉండడం వలన చర్మంపై ఉండే నల్లని మచ్చలకు విరుగుడుగా పని చేసి, ముఖాన్ని అందంగా మెరిసేలా చేస్తుంది. ఏ కాలంలో అయిన వాడె ఏక%క వస్తువు తేనే. ఈ తేనే వలన చర్మం, జుట్టు వంటి వాటికే కాక మొహాన్ని కూడా కాంతివంతంగా తయారుచేస్తుంది. నిమ్మరసం జిడ్డును కొరికేస్తుంది. దీనివల్ల మొహం పైన ఉండే జిడ్డు మరి యు నల్లని మచ్చలను తొలగించేసి మంచి రంగును అందిస్తుంది. ఆలుగాద్దను బాగా దంచితే వచ్చే రసాన్ని నల్లటి మచ్చలపై పూసి మర్దనా చేయడం వలన నల్లటి మచ్చలు కనిపించకుండ పోతాయి. ఉల్లిపాయలను బాగా దంచి, ఆపేస్ట్‌ను నల్లమచ్చలపై రాస్తేమచ్చలు పోయి, మొహం మెరిసిపోతుంది. ముఖంలో కణాలు పోయి మృదువు, కాంతివంతంగా ఉండటానికి

మృదువుకణాలు పోయి మృదువు,కాంతివంతంగా ఉండటానికి పాలు తీసు కుని అందులో చిటికెడు పసుపు, రెండు చెంచాల గంధం పొడి కలిపి మిశ్రమం లా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకుంటే మృతకణాలు తొలగి పోయి మృదువుగా ఉంటుంది. పావు చెంచా పాల పొడిలో కొద్దిగా తేనె కలిపి ముఖానికి మర్దన చేయాలి. పది నిమషాల య్యాక చల్లటి నీళ్ళతో కడిగి ముఖా నికి మాయిశ్చరె%జర్ రాసుకుంటే చర్మం కాంతివంతంగా మారుతుంది. కమలా ఫలం తొలును ఎండబెట్టి పొడిచేసి అందులోతగినంత పెరుగు కలిపి మిశ్రమం లా తయారు చేసి ముఖం, మెడకు పూట వేసి పావుగంటయ్యాక కడిగేస్తే మేను నిగారింపు సొంతం.




# మతిమరుపు మాయం



చాలా తలనొప్పిగా ఉంది. అలా క్యాంటీన్ కెళ్లి ఓకప్పు కాఫీ తాగొద్దాం రా... అంటు తన స్నేహితురాలిని పిలిచింది రమ్య. నిజమే మరి పని ఎక్కువగా ఉన్నప్పుడో లేదా చిరాకుగా ఉన్నప్పుడో కప్పు కాఫీ తాగితే ఆ హాయే వేరంటారు కాఫీ ప్రియులు. మరలాంటి కాఫీలో ఉండే కెఫిన్, కాఫీ ప్రియులందరి హృదయాలను దోచుకుంటూ మనిషిలో ఎన్నో రుగ్మతలను దూరం చేయడంలో తన వంతు పాత్రను పోషిస్తుందని నిపుణులంటున్నారు.

ముఖ్యంగా ప్రతిరోజూ మూడు కప్పు లకంటే కాఫీ తాగే మహిళల్లో వయసు పెరిగే కొంది వచ్చే మతిమరుపును రాకుండా చేస్తుందని ఇటీవల జరిగినన పరిశోధనలో తేలింది.

క్రమం తప్పకుండా కాఫీ తాగే మహిళల్లో మంచి ఫలితాలుంటాయని పరిశోధకులు అంటున్నారు. ఎవరె%తే రోజుకు మూడు కప్పు లు కాఫీ తాగుతారో వారు విన్న లేదా మాట్లాడిన మాటలకంటే చూసిన దృశ్యాలను ఎక్కువ కాలం గుర్తుంచుకుంటారు.

కెఫిన్ ఉత్సాహాన్ని, చలాకీతనాన్ని కలిగించే ఔషధంగా పనిచేస్తుంది. ఇంటర్వ్యూకు వెళ్ళే అరగంట ముందు అమ్మ ఇచ్చే ఓ కప్పు కాఫీని తాగితే ఎన్నో సత్ఫలితాలను కలుగజేస్తుందంటున్నారు. త్వరగా స్పందించే గుణాన్ని, ఆలోచింపజేసే సామర్థ్యాన్ని, కాఫీ పెంపొందిస్తుందట. అంతేకాదు, నిస్సత్తువను మాయం చేసి దాని స్థానే ఎంతో ఉత్సాహాన్ని కలుగజేస్తుంది.

తలనొప్పి, మె%గ్రెయిన్ నుంచి ఉపశమనాన్ని కలిగించే మెడిసిన్‌గా కూడా కెఫిన్ పనిచేస్తుంది. ఒక కప్పు కాఫీని సేవించడం ద్వారా ఒక డోసు ఆస్ప్రిన్ మాత్రలను తీసుకున్న దానితో సమానం.

కాఫీని సేవిస్తే అస్తమా రోగులకు ఎంతో ఉపశమనం కలుగుతుందంటున్నారు.

ఉదయం ఒక కప్పు కాఫీ తాగితే శ్వాస తీసుకోవడంలో ఎటువంటి ఇబ్బంది కలగదని నిపుణులంటున్నారు.దంత సమస్యలు రాకుండా నియంత్రిస్తుంది. కాఫీ విత్తనాలు, తేయాకులో ఉండే సుగుణాలు దంతాలపై బ్యాక్టీరియా చేరకుండా కాపాడుతుంది.

# మొక్కజొన్నతో మరింత ఆరోగ్యం




వర్షాకాలంలో చలిచలిగా ఉన్నపుడు వేడివేడి మొక్కజొన్న కంకితో ఎంత ఉల్లాసంగా తినేస్తామో.. అలాంటి మొక్కజొన్న గింజలు తినటం ఆరోగ్యానికి ఎంతోమేలు చేస్తుంది. దీనిని సాధార ణంగా జొన్నలని కూడా అంటారు. ఈ మొక్కజొన్న గింజలను వివిధ రకాలుగా వండుతారు. కండెలుగా వున్నప్పుడే వాటిని తీపివిగా తినేయ వచ్చు. లేదా వాటికి మసాలాలు, కారాలు కూడా తగిలించి తింటారు. గ్రేవీలో వేసి ఫ్రైడ్‌రె%స్‌తో కలిపి తినవచ్చు. లేదా ఉల్లిపాయ, పచ్చి మిర్చి వంటి వాటితో కూడా చేర్చి సాయంకాలం వేళ మంచి చిరుతిండిగా తినేయవచ్చు. మొక్కజొన్న కండెలను సాధారణంగా మనం నిప్పులపై వేడిచేసి బాగా కాలిన తర్వాత తింటాం. లేదా కాల్చిన మొక్కజొన్న కండెలకు వివిధ కారాలు, ఉప్పులు రాసికూడా తినేస్తాం. మొక్కజొన్న తినటం రుచే కాదు, అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా పొందవచ్చు.

**మొక్కజొన్న కండెలలోని ఆరోగ్య ప్రయోజనాలు:**

జీర్ణక్రియను పెంపొందిస్తుంది. మొక్కజొన్నలో పీచు పుష్కలంగా ఉంటుంది. అది జీర్ణక్రియకు బాగా పనిచేస్తుంది.ఆహారంలో పీచు వుంటే అది మలబద్ధకం, మొలలు వంటి వ్యాధులు రాకుండా కాపాడుతుంది. పేగు కేన్సర్ అరికడుతుంది.తమొక్కజొన్నలో కావలసినన్ని లవణాలు లేదా మినరల్స్ వుంటాయి. పసుపురంగులో వుండే ఈ చిన్న గింజలలో మినరల్స్ అధికం. మెగ్నీషియం, ఐరన్, కాపర్, ఫాస్పరస్ వంటివి కూడా వీటిలో వుండి ఎముకలు గట్టిపడేలా చేస్తాయి. మీ ఎముకల విరుగుట అరికట్టటమేకాక, మీరు పెద్దవారయ్యే కొద్ది కిడ్నీలను కూడా ఆరోగ్యంగా వుంచుతాయి. చర్మ సంరక్షణ-మొక్కజొన్నలో యాంటీ ఆక్సిడెంట్లు వుంటాయి. ఇవి చర్మాన్ని కాంతివంతంగా వుంచి ఎప్పటికి చిన్నవారుగా కనపడేలా చేస్తాయి. మొక్కజొన్న గింజలు తినటమే కాక, ఈ విత్తనాల నూనె కనుక చర్మానికి రాస్తే, దీనిలో వుండే లినోలె యాసిడ్ చర్మమంటలను, లేదా ర్యాష్‌లను కూడా తగ్గిస్తుంది. రక్తహీనతను అరికడతాయి. రక్తహీనత అంటే మీలోని ఎర్ర రక్తకణాల సంఖ్య ఐరన్ లేకపోవటం వలన గణనీయంగా పడిపోతుంది. మరి మీరు తినే స్వీట్ మొక్కజొన్న విటమిన్ మరియు ఫోలిక్ యాసిడ్‌లు కలిగి మీలో రక్తహీనత లేకుండా చేస్తుంది. కొల్లెస్టరాల్ నివారణ చేస్తాయి. శరీరంలో లివర్ కొలెస్టరాల్‌ను తయారు చేస్తుంది. రెండు రకాల కొలెస్టరాల్ తయారవుతుంది. అవి హెచ్‌డిఎల్ మరియు చెడు కొలెస్టరాల్ అయిన ఎల్‌డిఎల్. నేటి రోజులలో కొవ్వు అధికంగా ఉండే ఆహారాలు చెడు కొలెస్టరాల్‌ని పెంచి గుండెను బలహీనం చేసి గుండె సంబంధిత వ్యాధులు కలిగిస్తున్నాయి. తీపి మొక్కజొన్నలో ఉండే విటమిన్ సి, కేరోటియాయిడ్లు మరియు మయో ప్లేవినాయిడ్లు మీ గుండెను చెడు కొలెస్టరాల్ నుండి కాపాడుతాయి. శరీరంలో రక్తపస్రరణ అధికం చేస్తాయి. తగర్భవతులకు ఈ ఆహారం ప్రధానం-గర్భవతి మహిళలు తమ ఆహారంలో మొక్కజొన్న తప్పక కలిగి ఉండాలి. దీనిలో వుండే ఫోలిక్ యాసిడ్ గర్భవతి మహిళలకు మంచి ప్రయోజనం చేకూరుస్తుంది. కాళ్ళు చేతులు, వారికి వాపురాకుండా చేస్తాయి. ఫోలిక్ యాసిడ్ తగ్గితే అది బేబీ బరువును తక్కువ చేస్తుంది. కనుక మొక్కజొన్న తింటే, తల్లికి, బిడ్డకు కూడా ప్రయోజనమే.కనుక మీ ఆహారంలో తగినంత మొక్కజొన్న ఆహారం చేర్చి తినండి. దానివలన వచ్చే వివిధ ఆరోగ్య ప్రయోజనాలను పొందండి. వివిధ రోగాలను తగ్గించుకోండి. ఆరోగ్యంగా ఉండండి.

# చిన్నారుల్లో చెవుడుకు కారణాలు



కొందరిలో పుట్టుకతోనే, తల్లి గర్భంలో ఉన్నప్పుడు వాడిన మందులు, ఇన్‌ఫెక్షన్లు, పిండం అభివృఎద్ధి చెందడంలో మార్పులు రావడం లాంటి కారణాల వల్ల లోపాలతో పుట్టవచ్చు. రుబెల్లా, టాక్సోప్లాస్మోసిస్, సైటోమెగాలో వైరస్, సిఫిలిస్ (తల్లిదండ్రుల ద్వారా సంక్రమించే వ్యాధి), హెర్పిస్ సింప్లెక్స్, గవదబిళ్లలు, తట్టు, మెదడువాపు లాంటి ఇన్‌ఫెక్షన్లు వచ్చినప్పుడు చిన్నారుల్లో చెవుడుకు కారణమవుతాయి. ఇంకా మరికొన్ని కారణాలు తెలుసుకుందామా..

- స్ట్రెప్టోమైసిన్, ఫ్రూసిమైడ్, జెంటామైసిన్ లాంటి మందులు,
- రేడియేషన్, అల్ట్రాసౌండ్ లాంటి పరీక్షలు, ప్రసవ సమయంలో హైపోక్సియా, హైపర్‌బిలిరూబినిమియా (తల్లిదండ్రుల రక్తం సరిపడని కారణంగా వచ్చే వ్యాధి), -అతితక్కువ బరువుతో (15 వందల గ్రాముల కన్నా తక్కువ) పుట్టడం,
- తల, మెడ, చెవి సరిగ్గా ఉండాల్సిన రీతిలో లేనప్పుడు,
- కుటుంబంలో ఎవరికె%నా చెవుడు ఉండటం ,
- డౌన్స్ సింద్రోమ్, మార్‌ఫాన్స్ సింద్రోమ్, గోల్డెన్ హార్స్ సింద్రోమ్, పియరీ రాబిన్స్ సింద్రోమ్ లాంటి జన్యుసంబంధ వ్యాధులు చెవుడుకు కారణమవుతాయి.
- ఆస్టియోజెనిసిస్ ఇంపర్‌ఫెక్టా, ఆస్టియోస్క్లీరోసిస్ లాంటి ఎముకల వ్యాధి వల్ల చెవిలోని ఎముకల గొలుసులో కంపనాలు ఏర్పడవు. దానివల్ల శబ్దం లోపలి చెవికి చేరదు.
- సెక్రిటరీ డైటిస్ మీడియా వల్ల మధ్యచెవిలో నీరు లేదా జిగురు లాంటి పదార్థం చేరుతుంది. శబ్ద ప్రకంపనాలు లోపలి చెవికి అందక సరిగ్గా వినపడదు.
- వెలుపలి చెవి లేదా మధ్యచెవిలో గానీ ఇన్‌ఫెక్షన్ వల్ల చీము చేరి రంధం ఏర్పడుతుంది. తద్వారా వినికిడి శక్తి దెబ్బతింటుంది.
- చెవికి దెబ్బలు తగిలినప్పుడు సాధారణంగా కర్ణభేరి పగిలిపోవడమో, ఎముకల గొలుసు అస్తవ్యస్తం కావడమో జరుగుతుంది. తల ఎముకలు చిట్లిపోవచ్చు. ఇలాంటప్పుడు వినికిడి పోతుంది.
- గింజలు, పూసలు, పుల్లల లాంటివి పిల్లలు తెలియక చెవిలో పెట్టుకుంటుంటారు. దీనివల్ల కూడా వినికిడి పోయే ప్రమాదం ఉంది.

పరిష్కారాలు:

వెలుపలి చెవి పూర్తిగా లేని పిల్లల్లో మధ్యచెవి, లోపలి చెవి సరిగ్గా పనిచేస్తుందో లేదో ముందు పరిశీలిస్తారు. అవి బాగానే ఉంటే ప్లాస్టిక్ సర్జన్, ఇఎన్‌టి సర్జన్ కలిసి బయటిచెవిని, చెవినాళాన్ని కృఎత్రిమ పదార్థాలతో గానీ, శరీరంలోని ఇతర పదార్థాలతో గానీ రూపొందించి శబ్దం మధ్యచెవికి అందేవిధంగా చేస్తారు. తద్వారా వినగలుగుతారు. చెవిలో పెట్టుకునే గింజలు, పూసలు, పిన్నులు, దూది, స్పాంజి, పెన్సిల్ ముక్కలు, లేదా కీటకాలు చేరడం వల్ల వినికిడి తగ్గిపోతు ముందుగా కర్ణభేరికి అపాయం కలుగకుండా వాటిని బయటకు తీస్తారు. ఇలాంటప్పుడు ఏమాత్రం అజాక్షిగత్తగా ఉన్నా వినికిడి శక్తి మొత్తం పోవచ్చు. చెవిలో ఇన్‌ఫెక్షన్లు చేరినప్పుడు సకాలంలో మందులు వేయడం, డ్రెస్సింగ్ చేయడం జరగాలి.

కొన్నిసార్లు చెవిలో అదనంగా కండరాలు పెరుగుతాయి. వీటిని మైక్రోసర్జరీ ద్వారా తొలగిస్తే వినకిడి శక్తి వస్తుంది. ఆటోస్క్లీరోసిస్ లాంటి వ్యాధి వల్ల చెవిలోని ఎముకలు బిగుసుకుపోయినప్పుడు, చెవిలో రంధం పడినప్పుడు కూడా మైక్రోసర్జరీ అవసరం అవుతుంది. మధ్యచెవిలో నీరు చేరితే (సెక్షికిటరీ ఓటైటిస్ మీడియా) ఆ ద్రవాన్ని కర్ణభేరి ఆపరేషన్ ద్వారా బయటకు తీసేస్తారు. ఆపరేషన్ తరువాత మళ్లీ నీరు చేరే అవకాశం ఉంటుంది కాబట్టి కొంతకాలం వరకు కర్ణభేరిలో ఒకరకమైన బటన్‌ను ఉంచుతారు.

దీనివల్ల మధ్యచెవిలో తయారయ్యే ద్రవం బయటకు వెళ్లిపోతుంది. దీన్ని మెరింగాటమీ, గ్రొమెట్ ఆపరేషన్ అంటారు. కొన్నిసార్లు ఈ సర్జరీ చేసినా చెవిలో ద్రవం తగ్గకపోవచ్చు. ఇలాంటప్పుడు ఆ కారణాన్ని పరీక్షించి తదనుగుణమైన చికిత్స అందించాలి.

మధ్యచెవిలో ద్రవం ఏర్పడటానికి యూస్టేషియన్ నాళానికి సంబంధించిన వ్యాధులు, ఎడినాయిడ్స్, ముక్కు వెనకాల ఉండే టాన్సిల్స్ లాంటి కండరాలు, సైనసైటిస్, టాన్సిల్స్,క్లఫ్ పాలెట్ మొదలైనవి ముఖ్యమైన కారణాలు. వీటన్నింటినీ సర్జరీ ద్వారా సరిచేయవచ్చు.

# చిన్నారుల్లో డిప్రెషన్

ఒకే ఇంట్లో ఉండే ఇద్దరు పిల్లల్లో ఒకరిని ఒకలా, మరొకరిని ఇంకోలా చూస్తే వారిలో ఆత్మ న్యూనతా భావం పెరుగుతుందని పరిశోధకులు అంటున్నారు. ముఖ్యంగా చిన్నతనంలో పిల్లల మధ్య వారి తెలివితేటల విషయంలో ఉన్న తేడా పట్ల తల్లిదండ్రులు ఎంత సమతూ కంతో వ్యవహరిస్తే అంత మంచిది. ఇలా వారి మధ్య ఉండే తేడాలను పదేపదే ప్రస్తావించి వారిపై మానసిక ఒత్తిడి తెస్తే మాత్రం ఆ భావన ఆ పిల్లల్లో పెరిగి తామెం దుకూ పనికిరామన్న ఆత్మ న్యూనతకు దారి తీస్తాయి. ఈ బీజాలను నాటేది వేరెవరో కాదు...స్వయానా తల్లిదండ్రులే. దాని వల్ల పిల్లలు పెద్దయ్యాక వారి మధ్య ప్రేమానురాగాలు పెంపొందడానికి బదులుగా ఈర్ష్య, అసూయలు వెల్లువెత్తుతాయి. ఇదే ఆత్మన్యూనతా భావంగా స్థిరపడుతుంది. ఈ ఆత్మన్యూనతా భావం అనేది ఒక వ్యక్తి జీవితంలో వారి చిన్నతనంలోనే తల్లిదండ్రులు ఇతర పెద్దల అజాగ్రత్తవల్ల, బాఎధ్యతా రహితమైన వ్యాఖ్యల వల్ల వారి మస్తిష్కంలో నాట బడ తాయి. దాని ప్రభావం మనిషి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసిగాని వదలదు. పెద్దలు పిల్లలను తోటి పిల్లలతో పోల్చి మాట్లాడడం లాంటి పొరపాటు చేస్తుంటారు. ఆ మాటలకు ఆ లేత హృదయాలు ఎంతగా గాయ పడతాయో చెప్ప లేము.

ఇక ఆడపిల్లలైతే రూపలావణ్యాలతో అక్కతో, చెల్లితో పోల్చి వారు బాధపడేలా చేస్తారు. రంగులో ఆ పిల్లలను పోల్చి బాల్యం లోనే నల్ల పిల్ల అని ముద్ర వేస్తారు. పొట్టివారైతే పొట్టిపిల్ల అని అంటూ ఆ భావన వారిలో కలిగేలా చేస్తారు. ఇలాంటి మాటల వల్ల ఆ పిల్లల్లో ఆత్మన్యూనతాభావం క్రమంగా పెరిగి బాధను ఎవరికీ చెపలేక తమలో తామే కుంగిపోతుంటారు.

# కర్లింగ్ హెయిర్ సాఫ్ట్ గా...



కర్లి హెయిర్(రింగుల జుట్టు)ఎల్లప్పుడూ ట్రెండీగా ఫాషన్‌గా కనబడుతుంది. మీకు తక్కువ జుట్టు ఉన్నట్లైతే లేదా మీ జుట్టు లిప్ ఉంటే, వాటిని కర్ల్ చేయడానికి కొంత వాల్యూమ్‌ను జోడించాల్సిన అవసరం ఉంది. మీ రింగుల జుట్టుకు సరైన జాగ్రత ఇస్తే కానీ, ఈ రింగు జుట్టు ఆకర్షనీయంగా ఉంటుంది. కర్లింగ్ హెయిర్‌కు సాధారణంగా హీట్ ట్రీట్మెంట్, డ్రైయర్స్ రోలర్స్‌ను ఉపయోగించడం వల్ల జుట్టు రాలడం లేదా జుట్టు ఎండిపోవడానికి లేదా పొడిబారడానికి దారి తీస్తుంది. రింగు రింగుల జుట్టు సాధారణంగా ఉండే జుట్టుకంటే పెళుసుగా ఉండటమేగాకుండా, పొడి పొడిగా ఉంటుంది. అదే విధంగా సాధారణ జుట్టుకంటే రింగుల జుట్టు వాతావరణ పరిస్థితులకు వెంటనే ప్రభావితం అవుతుంది. కాబట్టి రింగుల జుట్టు ఉన్నవారు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాల్సి ఉంటుంది. కర్లింగ్ హెయిర్‌కు కెమికల్స్‌లో క్వాలీటీ హెయిర్ ప్రొడక్ట్స ఉపయోగించడం వల్ల మీ జుట్టుకు హాని కలిగించే ప్రభావం ఎక్కువ. కఠినమైన రసాయనాలు వేడి చుండ్రుకు, జుట్టు చికాకు ఇతర చర్మ సమస్యలకు కారణమవుతుంది. అందుకోసం ఇక్కడ మీ కర్లింగ్ హెయిర్ మృదువెన మెరిసి ఉంచేందుకు మీ కోసం కొన్ని సులభంగా చిట్కాలు అందిస్తున్నాం. పరిశీలించండి...

**షాంపుతో షవర్ బాత్:**

షాంపుతో వారానికోసారైనా తప్పకుండా తల స్నానం చేయాలి. దానివల్ల జిడ్డులేకుండా ఉంటుంది. మాయిశ్చరైజింగ్ షాంపు అయితే జుట్టుని పొడిగా ఉంచడానికి తోడ్పడుతుంది. వారంలో వీలయినన్ని సార్లు షాంపుతో తలస్నానం చేసినా జుట్టు జిడ్డులేకుండా ఆరోగ్యంగా కనిపిస్తుంది. షాంపూ వాడని రోజుల్లో జుట్టుని వేడినీటితో కడగాలి. దీనివల్ల పోషణ ఇచ్చే సహజనూనె పదార్థాలు కోల్పోకుండా జుట్టు ఆరోగ్యంగా కనిపిస్తుంది.

**కేశాలు తేమగా ఉన్నప్పుడు హెయిర్ స్టైల్:**

తలస్నానం తర్వాత, తలలోని నీటిని మొత్తాన్ని పిండేయాలి. జుట్టు తడిగా ఉన్నప్పుడే మీకు కావల్సిన హెయిర్ స్టైల్‌ను (మీకు నచ్చిన విధంగా దువ్వుకొని)తర్వాత జుట్టు ఆరనివ్వాలి. ఇది దీర్ఘకాలం అందంగా కర్లింగ్ హెయిర్ మృదువుగా ఉండటానికి జుట్టుకు సహాయం చేస్తుంది.

**క్వాలిటీ ప్రొడక్ట్స ఉపయోగించడం:**

నాణ్యతలేని ఉత్పత్తులు, కఠిన రసాయనాలతో తయారు చేసిన ఉత్పత్తులు కర్లింగ్ హెయిర్, తలమాడు మీద ఎక్కువ ప్రభావం చూపెడుతుంది. బలమైన రసాయనాలు దీర్ఘకాలం పాటు ఉపయోగించడం వల్ల అది మీ జుట్టుకు చాలా ప్రమాధకరంగా మారుతుంది. మరి మీ రింగుల జుట్టును మృదువుగా మరియు మెరిసేలా ఉంచుకోవాలంటే, మీ కేశాలకు నప్పే, మంచి క్వాలిటి ఉన్న హెయిర్ ప్రొడక్ట్స్‌ను మాత్రమే ఉపయోగించాలి.

**ఆపిల్ సైడర్ వెనిగర్:**

ఆపిల్ సైడర్ వెనిగర్ తలలో చర్మంపైపొర మూసివేయుండా ఉంచడానికి కర్లింగ్ హెయిర్ ను మృఎదువుగా ఉంచడానికి సహాయపడుతుంది . గోరువెచ్చని నీటిలో ఒక చెంచా ఆపిల్ సైడర్ వెనిగర్ ను వేసి, తలస్నానం చేసిన తర్వాత చివరగా ఈ నీటిని తలమీద పోసుకోవాలి. ఇది మీ కేశాలను తడుపుతూ మీ కేశాలకు కండీషనర్ గా పనిచేస్తాయి.

బేకింగ్ సోడా:

బేకింగ్ సోడాలో ఆల్కలీన్ ఉంటుంది. ఇది మీ చర్మం పైపొరను పెంచడానికి మీ కర్లింగ్ హెయిర్ మృఎదువుగా సాఫ్ట్‌గా చేయడానికి సహాయపడుతుంది . కాబట్టి ఒక టేబుల్ స్పూన్ బేకింగ్ సోడాను, మూడు చెంచా కర్లీ ఫ్రెండ్లీ కండీషనర్‌లో వేసి తలకు అప్లై చేయాలి. గోరు వెచ్చని నీటితో తలమీద పోసుకోవాలి.

ఎయిర్ డ్రై కర్ల్స: మీ కేశాలను సహజంగా తడి ఆరబెట్టుకోవాలి. ఒక వేళ మీరు ఆతురుతలో ఉంటే, డ్రైయర్‌ను తక్కువ హీట్‌లో పెట్టి తడి ఆరుపుకోవచ్చు. వాతావరణంలో అధిక ఉష్ణోగ్రత వల్ల మీ కేశాలను పెళుసుగా లేదా కర్లింగ్ హెయిర్ రఫ్‌గా మారడం చేస్తుంది.

కాబట్టి మీ హెయిర్‌కు అతి తక్కువ వేడి వర్తింపజేస్తే మీ కర్లి హెయిర్ మరింత తేమ కలిగి ఉంటుంది.

# ఇలాంటి సంఘటన పునరావృతం కారాదు

## ఉపాధ్యాయులు తనిఖీలు ముమ్మరం చేయాలి

## మంత్రి గంటా ఆదేశం



విశాఖపట్నం పాఠశాలలో విద్యార్థులు గొడవపడి విద్యార్థి మృతిచెందడం తీవ్రంగా తనను కలిచివేసిందని, ఇటువంటి పరిణామాలు తిరిగి పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఉదయం మధురానగర్‌లోగల జివిఎంసి ప్రాథమిక మరియు ఉన్నత పాఠశాలను మంత్రి సందర్శించారు. శనివారం విద్యార్థుల తగవులాటలో మృతిచెందిన 10వ తరగతి చదువుతున్న ఎస్. చిన్న తల్లిదండ్రులు రాము, సత్యవతిలను మంత్రి పరామర్శించారు. గొడవ జరిగిన సంఘటన గూర్చి సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి దర్యాప్తు చేయాల్సిందిగా ఆదేశించారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తరువాత కూలంకషంగా బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీసులను ఆదేశించారు. ఇటీవల కాలంలో విద్యార్థులు మాదకద్రవ్యాల వినియోగం, ఈవ్‌టీజింగ్‌లాంటి కార్యకలాపాలు ఎక్కువగా చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తున్నదని అన్నారు.. నగరాలలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలలో తనిఖీలు ముమ్మరం చేసి సంబంధిత నివేదికను అందజేయాల్సిందిగా ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, తరగతి గదులలో పిల్లలు ఏమి చేస్తున్నారో అన్నది ఒకకంట కనిపెడుతూ ఉండాలన్నారు. పాఠశాలలో చదువుతున్న ప్రతీ విద్యార్థుల ఫోన్ నెంబర్లు, డేటా సంబంధిత వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

విద్యార్థులు హాజరుపట్టికు పరిశీలించి గైర్హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి పూర్తి వివరాలను తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివద్ధికి, విద్యకు ప్రాధాన్యత కల్పిస్తున్నదన్నారు. అన్ని పాఠశాలల్లోను మౌలిక వసతులను కల్పించడం జరుగుతున్నదన్నారు.

# ముంబయిలో రోడ్డెక్కని బెస్ట్ బస్సులు



ముంబయి: తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ ముంబయి మహానగరంలో బృహన్ ముంబయి ఎలక్ట్రిక్ సప్లై, ట్రాన్స్‌పోర్ట్ (బెస్ట్) కార్మికుల సంఘం ఆదివారం అర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగింది. దీంతో మహానగరంలో 3,700 బస్సులు రోడ్డెక్కలేదు. కార్మికుల సమ్మెతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నేడు రక్షాబంధన్ పర్వదినం కావడంతో ఈ కష్టాలు మరింత పెరిగాయి. ప్రతి రోజు బెస్ట్ బస్సులు దాదాపు 29 లక్షల ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తాయి.

బెస్ట్ కార్మిక సంఘాలు గత కొన్ని రోజులుగా తమ డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నాయి. ముంబయి నగరపాలక సంస్థ అధికారులకు, బెస్ట్ కార్మిక సంఘాల నేతలకు మధ్య పలుమార్లు చర్చలు జరిగాయి. గత మూడు నెలలుగా జీతాలు సరిగ్గా చెల్లించడం లేదని, తమ ఇతర డిమాండ్లను పరిష్కరించడం లేదని కార్మికులు సమ్మెకు పిలుపునిచ్చారు. తమ డిమాండ్ల పరిష్కారంపై బీఎంసీ నుంచి రాతపూర్వక హామీ లభించలేదని కార్మిక సంఘాల నేతలు తెలిపారు. 36 వేల మంది కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నారు.

# క్రికెటర్ శ్రీశాంత్‌కు భారీ ఊరట



కొచ్చి: తనపై భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు(బీసీసీఐ) విధించిన జీవితకాల నిషేధాన్ని ఎత్తివేయాలంటూ అవిశ్రాంతంగా పోరాడుతున్న క్రికెటర్ శ్రీశాంత్ కు ఎట్టకేలకు భారీ ఊరట లభించింది. శ్రీశాంత్ పై బీసీసీఐ విధించిన జీవితకాల నిషేధాన్ని ఎత్తివేస్తూ సోమవారం కేరళ హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ మేరకు శ్రీశాంత్ దాఖలు చేసుకున్న పిటిషన్ పై తుది తీర్పును హైకోర్టు వెలువరించింది. దానిలో భాగంగా బీసీసీఐ క్రమశిక్షణా కమిటీకి ఆదేశాలు జారీ చేసింది.

2013లో జరిగిన ఐపీఎల్6 సీజన్‌లో శ్రీశాంత్ స్పాట్ ఫిక్సింగ్ ఆరోపణలతో అరెస్ట్ అయ్యాడు. అయితే 2015 జూలైలో అతడిపై ఉన్న అభియోగాలను కొట్టివేస్తూ పటియాలా హౌస్ కోర్టు నిర్దోషిగా విడుదల చేసింది. ఆ తర్వాత స్థానిక టోర్నీల్లో ఆడేందుకు శ్రీశాంత్ ప్రయత్నించినా బీసీసీఐ మాత్రం తాము విధించిన నిషేధాన్ని అలాగే కొనసాగిస్తూ వస్తోంది. దీనిలో భాగంగా ఇటీవల కేరళ హైకోర్టును శ్రీశాంత్ ఆశ్రయించాడు. ఆ క్రమంలోనే మే నెలలో బీసీసీఐకి కేరళ హైకోర్టు నోటీసులు కూడా జారీ చేసింది. అయితే బీసీసీఐ విధించిన జీవితకాల నిషేధాన్ని కోర్టు ఎత్తివేస్తున్నట్లు తాజా తీర్పు ద్వారా ప్రకటించింది.

### గతంలో కోర్టు చెప్పినా..

తనకు ఢిల్లీ పోలీసులు క్లీన్ చిట్ ఇచ్చారని, దాంతో తనపై ఉన్న జీవితకాల నిషేధం తొలగించాలని శ్రీశాంత్ కేరళ హైకోర్టును కోరాడు. తనపై కావాలనే నిషేధాన్ని కొనసాగిస్తున్నారని కోర్టుకు విన్నవించాడు. దానిపై స్పందించిన కోర్టు.. శ్రీశాంత్ పై ఉన్న నిషేధాన్ని తొలగించాలంటూ బీసీసీఐకి నోటీసులు పంపింది. అయితే బీసీసీఐ మాత్రం తన వైఖరిని మార్చుకోకుండా అతనిపై నిషేధాన్ని కొనసాగించింది. అతనిపై తాము తీసుకున్న నిర్ణయంలో ఎటువంటి మార్పు ఉండదని బీసీసీఐ పెద్దలు తేల్చిచెప్పారు.

ఆ క్రమంలోనే శ్రీశాంత్ పై నిషేధాన్ని ఎందుకు ఎత్తివేయారో చెప్పాలంటూ బీసీసీఐకి కోర్టు మరోసారి నోటీసులు పంపింది. ఆపై ఈ కేసును పలుమార్లు విచారించిన కోర్టు.. శ్రీశాంత్ పై నిషేధాన్ని ఎత్తివేస్తూ తుది ఆదేశాలు జారీ చేసింది.

## ఆయన పక్కన

# కోహ్లీ పిల్లోడిలా ఉన్నాడు



కొలంబో: మూడు టెస్టులు, ఐదు వన్డేలు, ఏకైక టీ20 కోసం కోహ్లీ సేన ప్రస్తుతం శ్రీలంకలో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఇరు జట్ల మధ్య రెండో టెస్టు ఆదివారం ముగిసింది. ఇన్నింగ్స్ 53 పరుగుల తేడాతో విజయం సాధించి 2-0తో తిరుగులేని ఆధిక్యం సంపాదించింది. మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న కోహ్లీ ఆ తర్వాత జట్టు సభ్యులతో కలిసి సంబరాలు చేసుకున్నాడు.

ఆదివారం సాయంత్రం కోహ్లీ ఓ ప్రత్యేక అతిథిని కలిశాడు. ప్రముఖ రెజ్లర్‌తో సమావేశమయ్యారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను కోహ్లీ సోషల్‌మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నాడు. ఇంతకీ అతనెవరంటే భారత ప్రొఫెషనల్ రెజ్లర్ దలీప్ సింగ్ రానా అలియాస్ ద గ్రేట్ ఖలీ. ద గ్రేట్ ఖలీని కలవడం ఎంతో ఆనందంగా ఉంది అని కోహ్లీ పేర్కొన్నాడు. ఖలీ పక్కన కూర్చున్న, నిల్చున్న ఫొటోలను కోహ్లీ ట్విటర్‌లో ఉంచాడు. ఆ ఫొటోలను చూసిన అభిమానులు ఆశ్చర్యపోయారు. 7.1 అడుగుల ఎత్తు ఉన్న ఖలీ పక్కన కోహ్లీ చిన్నోడిలా కనిపిస్తున్నాడు. ఈ ఇరువురి ఫొటోలను చూసిన అభిమానులు నెట్టింట్లో సరదా కామెంట్లు పెట్టారు. ఖలీ పక్కన కోహ్లీ పిల్లోడిలా ఉన్నాడు, కోహ్లీ నువ్వు చాలా చిన్నగా ఉన్నావు, ఇలా ఎత్తుగా ఉన్న ఫాస్ట్‌బౌలర్ నీకు అవసరం అని ఎవరికి నచ్చినట్లు వారు ట్వీట్లు పెట్టారు.

# గొప్ప అథ్లెట్స్‌లో అతనొక్కడు



లండన్: ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా జరిగిన 100మీటర్ల పరుగు పందెంలో జమైకా చిరుత ఉసేన్ బోల్ట్ కాంస్యంతో సరిపెట్టుకున్న సంగతి తెలిసిందే. అమెరికాకు చెందిన జస్టిన్ గాట్లిన్, కోల్‌మన్ స్వర్ణ, రజత పతకాలు సాధించారు. పోటీ అనంతరం బోల్ట్ మాట్లాడుతూ.. నేను ఎదుర్కొన్న గొప్ప అథ్లెట్స్‌లో గాట్లిన్ ఒకడు. గాట్లిన్ పట్ల నాకెప్పుడూ గౌరవమే ఉంటుంది. గొప్ప అథ్లెట్‌గా పేరు తెచ్చుకునేందుకు అతను ఎంతగానో శ్రమించాడు. నా సామర్థ్యం మేరకు నేను పరిగెత్తాను. పోటీల్లో గెలుపు ఓటములు సాధారణం. ప్రస్తుత ఛాంపియన్‌షిప్‌లో నేను స్వర్ణం సాధించలేదని నా పరుగు ఇక్కడితో ఆగిపోదు. దీని వల్ల నా కెరీర్‌లో ఎలాంటి మార్పులు ఉండవు అని అన్నాడు.

అనంతరం బోల్ట్ గురించి గాట్లిన్ మాట్లాడుతూ..ఉసేన్ బోల్ట్ గొప్ప అథ్లెట్. త్వరలో అతను అథ్లెటిజంను వదిలేస్తున్నాడు. అతన్ని నేనెప్పటికీ గౌరవిస్తూనే ఉంటాను. ఎప్పుడు పోటీల్లో పాల్గొన్నా.. పోటీల అనంతరం నేను బోల్ట్‌ని అభినందిస్తాను. అంతేకాదు కౌగిలించుకుని అభినందనలు తెలుపుతాను అని గాట్లిన్ తెలిపాడు.

# సాంకేతిక విద్యాప్రమాణాల తీరు ఆందోళనకరం

## సెంచూరియన్ వర్సిటీ కులపతి బీఎన్‌ఎన్ రాజు

విజయవాడ : దేశంలో సాంకేతిక విద్యా ప్రమాణాలు పెరగకపోవడం ఆందోళన కలిగిస్తుందని ప్రముఖ విద్యావేత్త సెంచూరియన్ వర్సిటీ కులపతి బీఎన్‌ఎన్ రాజు అన్నారు. ఆదివారం గాంధీనగర్‌లోని ఒక హోటల్‌లో జరిగిన జర్నలిస్టు మాసపత్రిక ఏడో వార్షిక సభలో ఆయన మాట్లాడుతూ దేశం సాంకేతికంగా అభివృద్ధి చెందకపోతే భవిష్యత్తులో ఆర్థిఖక వృద్ధిరేటు పడిపోయే ప్రమాదం ఉందన్నారు. దేశంలో అనేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన సాంకేతిక విద్యా సంస్థలు ఉన్నప్పటికీ విద్యా ప్రమాణాలు నిరాశాజనకంగా ఉంటున్నాయన్నారు. సాంకేతిక నిపుణుల కొరత కారణంగానే అనేక ప్రాజెక్టులు ఆలస్యమవుతున్నాయన్నారు. సాంకేతికంగా ఎంత ఎదగినా ఇప్పటికీ స్వదేశీ ప్రాజెక్టుల నిర్మాణ పనులను విదేశీ సంస్థలకు అప్పగిస్తున్నారని మనం చేపట్టలేకపోవడం విచారించదగ్గ విషయమన్నారు.

ఉన్నత విద్యను అభ్యసించిన అనేక మంది విదేశాలకు వెళ్లిపోతున్నారని దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడ్డుకట్ట వేయాలన్నారు. సహచట్టం మాజీ కమిషనర్ విజయబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొంత మంది ప్రజాప్రతినిధులపై క్రిమినల్ కేసులు ఎత్తివేయడం సమాజానికి హాని కలిగించే చర్య అన్నారు.

ఇదే సాంప్రదాయాన్ని కొనసాగిస్తే సమాజంలో అరాచక పరిస్థితులు ఏర్పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

# కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం...

న్యూఢిల్లీ : పట్టణాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో కేంద్రప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకోనుంది.

నగరాలు, పట్టణాల్లో నివాసముంటున్న వారికి కారు, ఫ్రిజ్, ఏసీ ఉన్నాయా ? అయితే సంక్షేమ పథకాలు పొందేందుకు మీరు అర్హులు కాదంటూ కేంద్రం నియమించిన దేబ్రాయ్ కమిటీ బాంబులాంటి వార్త పేల్చింది. నాలుగు గదుల ఇల్లున్నా, కారు లేదా ఎయిర్ కండీషనర్, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్, ద్విచక్రవాహనం ఉంటే మీకు సర్కారు సంక్షేమ పథకాల ఫలాలు పొందటానికి అర్హులు కాదంటూ బిబేక్ దెబ్రాయ్ కమిటీ సిఫార్సు చేసింది.

తాజాగా జరపనున్న సాంఘీక ఆర్థిక సర్వేలో పట్టణ వాసులకు పైన పేర్కొన్న వస్తువులు ఇంట్లో ఉంటే సంక్షేమ పథకాలు అందవని కమిటీ స్పష్టం చేసింది. ఇల్లు లేని వారు, పాలిథీన్ కవర్ల గుడిసెల్లో నివాసముండేవారు, ఎలాంటి ఆదాయం లేని, మగవారు లేని ఇళ్ల వారికి, పిల్లలు సంక్షేమ పథకాలు పొందవచ్చని కమిటీ చెప్పింది.

మొత్తంమీద పట్టణాల్లో నివాసముంటున్న వారిలో 59 శాతం మంది సంక్షేమ పథకాలు పొందడానికి అర్హులని స్పష్టం చేసింది.

# టీమిండియాతో మ్యాచ్‌లను బహిష్కరిస్తేనే..



కరాచీ: తమతో ద్వైపాక్షిక క్రికెట్ సిరీస్ లు ఆడటానికి విముఖత వ్యక్తం చేస్తున్న భారత జట్టుతో పూర్తిస్థాయి సంబంధాలను తెంచుకోవటమే ఉత్తమమైన మార్గమని పాకిస్తాన్ మాజీ కెప్టెన్ జావెద్ మియాందాద్ అభిప్రాయపడ్డాడు. భారత్ తో అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) నిర్వహించే మ్యాచ్ లను సైతం బాయ్ కాట్ చేయాలని ఈ మేరకు పాక్ క్రికెట్ కు సూచించాడు. అసలు తమతో ద్వైపాక్షిక సిరీస్ లు జరపడానికి భారత్ ను ఒప్పించలేని ఐసీసీ.. వారు నిర్వహించే టోర్నీల్లో భారత్ తో పాకిస్తాన్ ను ఆడించడానిక ముందుకు రావడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించాడు. భారత్ తో మ్యాచ్ లను ఆడకుండా దూరంగా ఉన్నప్పుడే ఐసీసీకి తగిన బుద్ధి చెప్పినట్లు అవుతుందన్నాడు.

'మనం ఎప్పుడైతే భారత్ తో జరిగే ఐసీసీ టోర్నీలకు దూరంగా ఉంటామో.. అప్పుడు ఆ టోర్నీ ఆదరణ కూడా తగ్గుతుంది. దాంతో ఐసీసీని ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేయొచ్చు. అలా చేసిన క్రమంలో మనకు తగిన గౌరవం ఉండటమే కాదు.. మన మాటను కూడా ఐసీసీ వినడానికి ముందుకొస్తుంది. అంతేకానీ ఐసీసీపై స్ట్రైక్ చేయకుండా ఉంటే మాత్రం మనం ఏమీ సాధించలేము. ఐసీసీలో మన మాట వినేవారే లేరు. అక్కడ అంతా బీసీసీఐదే హవా. ఐసీసీలో బీసీసీఐ చాలా బలంగా ఉంది. బీసీసీఐ రూ.100 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ ఐసీసీని ఆశ్రయించడం వల్ల ఎటువంటి ఉపయోగం ఉండదు. ఇక్కడ మన సమయంతో పాటు, డబ్బు కూడా వృథా ప్రయాసగానే మిగిలిపోతుంది. టీమిండియాతో మొత్తం మ్యాచ్ లను బహిష్కరించే ఐసీసీపై తిరుగుబాటు చేయండి. ఇప్పటికే చాలా నష్టపోయిన మనకు పోగొట్టుకోవడానికి ఏమీ లేదు.భారత్ తో ఐసీసీ మ్యాచ్ లను బాయ్ కాట్ ఒక్కటే సరైన మార్గం'అని మియాందాద్ పేర్కొన్నాడు.

# తెలుగువారి సాంస్కృతిక రాజధాని విజయవాడ : నటుడు గిరిబాబు

విజయవాడ : తెలుగు రాష్ట్రాల్లో కళారంగానికి కృష్ణా జిల్లా జన్మస్థానం కాగా.. విజయవాడకు సాంస్కృతిక రాజధానిగా పేరుందని ప్రముఖ సినీనటుడు గిరిబాబు అన్నారు. సుమధుర కళానికేతన్ ఆధ్వర్యంలో జరుగుతున్న హాస్యనాటిక పోటీల్లో భాగంగా సిద్ధార్థ కళాపీఠం ఆడిటోరియంలో గిరిబాబును జంధ్యాల స్మారకపురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సినీపరిశ్రమలో కృష్ణా జిల్లా భాషనే మాట్లాడతారన్నారు.ఉద్ధండులైన మహానటులు ఎన్టీరామారావు, అక్కినేని నాగేశ్వరరావు, శోభన్‌బాబు వంటి వారు కృష్ణా జిల్లా వాసులేనన్నారు. జంధ్యాల మంచి మనిషని, తనకు మంచి మిత్రుడేకాక తన సినిమాలకు మంచి మాటలు అందించిన రచయిత అని చెప్పారు. ఆయన పేరుతో ఉన్న జంధ్యాలపురస్కారాన్ని అందుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. నగర సంయుక్త పోలీసు కమిషనర్ రమణకుమార్ మాట్లాడుతూ ప్రాశ్చాత్య సంస్కృతిపట్ల యువత ఆకర్షితులవడం సమాజానికి మంచిది కాదన్నారు.

# రజనీతో భాజపా నేత భేటీ



చెన్నై: తమిళ్ సూపర్‌స్టార్ రజనీకాంత్‌ను భాజపా యువ మోర్చా జాతీయ అధ్యక్షురాలు పూనమ్ మహాజన్ కలిశారు. ఆమె రజనీ ఇంటికి వెళ్లి ఆయనతో కాసేపు మాట్లాడారు. అయితే ఈ సమావేశంలో ఎలాంటి రాజకీయ అంశాలు చర్చకురాలేదని భాజపా నేతలు చెబుతున్నారు. రజనీ రాజకీయాల్లోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని గతంలో వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. కానీ దీనిపై ఆయన ఎటూ తేల్చలేదు. రాజకీయాల్లోకి వచ్చే విషయం గురించి ఆలోచిస్తున్నామని, ఓ నిర్ణయానికి వచ్చిన తర్వాత ప్రకటిస్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ భేటీ జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది.








Editor : Bete Sai Trilok, Printed and Published by Bete Chandra Sekhar on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published from D.No:58-3-15/1A, Atchamma Street, Patamata, Vijayawada-520 010, A.P. and Printed at VIJAYABHANU PRESS, D.No.9-3-17, Pithapuram Colony, Visakhapatnam -530 003, RNI No.APTEL/2008/24468, ★ e-mail: vijayabhanudaily@gmail.com